


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 339 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 9 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :339 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 9 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉంది:

### రాష్ట్రపతికి లేఖ రాసిన సునీత



- వివేకా హత్య కేసులో న్యాయం కోసం రాష్ట్రపతికి కుమార్తె సునీత లేఖ
- ఏడేళ్లు దాటినా పూర్తిస్థాయి న్యాయం జరగలేదని ఆవేదన
- హత్య వెనుక భారీ కుట్ర, మనీ ట్రయల్‌పై సమగ్ర విచారణకు విజ్ఞప్తి
- హత్య వార్త జగన్‌కు ముందుగా ఎలా తెలిసిందో తేల్చాలని అభ్యర్థన
- ప్రధాని, ఏపీ, తెలంగాణ సీఎంలకు కూడా లేఖ ప్రతులు

- మిగతా 2లో


## అమరావతి పనుల్లో అవినీతి?

### సీపీఐ నారాయణ తీవ్ర వ్యాఖ్యలు

- అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్న నారాయణ
- ఐకానిక్ టవర్లు, సచివాలయ నిర్మాణం జోరుగా సాగుతోందని వ్యాఖ్య
- అవినీతి పునాదులు బలపడుతున్నాయని నారాయణ ఆందోళన
- రాజధాని నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని డిమాండ్
- గత పదేళ్లలో రాజధానికి తీవ్ర నష్టం జరిగిందని వ్యాఖ్య

- మిగతా 2లో





## ప్రపంచం ఎలా మారుతుందో చెప్పలేం.. కానీ, గెలవాలంటే..!

### యువతకు మోదీ కీలక సందేశం

- ఎప్పటికప్పుడు నేర్చుకునేవారే విజయం సాధిస్తారన్న మోదీ
- టెక్నాలజీతో ఉద్యోగాలు, పరిశ్రమలు మారుతున్నాయని వ్యాఖ్య
- యువత నిర్ణయాలు 'వికసిత్ భారత్'పై ప్రభావం చూపుతాయని వెల్లడి
- వచ్చే 30-35 ఏళ్లు యువతకు కీలకమని హితవు
- పరిశోధన, కొత్త ఆలోచనల్లో అవకాశాలు పెరుగుతున్నాయని వెల్ల

- మిగతా 2లో

# ఇంటింటా జాతీయ జెండా..

## దేశ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యానికి సీఎం చంద్రబాబు పిలుపు

- ఏపీలో 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమానికి శ్రీకారం
- ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలని పిలుపు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధనే లక్ష్యం
- ప్రజలు లబ్ధిదారులుగా కాకుండా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్న సీఎం
- యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ దీన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకా రం చుట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారు లను ఆదేశించారు. 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి పౌరుడూ తన వంతు పాత్ర పోషించేలా ఈ కార్యక్ర మాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని ఆయన దిశానిర్దేశం చేశారు. శనివారం అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమ రూపకల్పనపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించి 80వ వసంతంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, దేశ నిర్మాణ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించాలని సూచించారు. "ఆగస్టు 15 నుంచి 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని ప్రారంభించాలి. ఇందులో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజలను చైతన్యవంతం చేయాలి. 'మై నేషన్, నేషన్ ఫస్ట్' (నా దేశం, దేశమే ప్రథమం)

- మిగతా 2లో

## కూటమి ప్రభుత్వానికి మద్దతుగా కర్నూలులో డీఎస్సీ విజేతల భారీ ర్యాలీ



- మెగా డీఎస్సీ 2025కి మద్దతుగా టీచర్ల భారీ ర్యాలీ
- కర్నూలులో 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించిన నూతన ఉపాధ్యాయులు
- తమ నియామకాలపై దుష్ప్రచారాన్ని ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు
- ప్రతిభతోనే ఉద్యోగాలు సాధించామని, లంచాలు ఇవ్వలేదని స్పష్టీకరణ
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రదర్శన

పెన్ పవర్ డెస్క్:మెగా డీఎస్సీ 2025 నియామకాలపై వైసీపీ వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, తమ ఆత్మగౌరవాన్ని చాటుకునేందుకు నూతన ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. కర్నూలు నగరంలో శనివారం 'ఆత్మగౌరవ ర్యాలీ' పేరుతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కర్నూలు నగరంలోని చారిత్రాత్మక కొండారెడ్డి బురుజు వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ, జిల్లా పరిషత్ కార్యాలయం వరకు కొనసాగింది. ఉపాధ్యాయుల హక్కులు, పారదర్శక నియామకాలకు మద్దతుగా

- మిగతా 2లో

## ఎల్ నినో ముప్పు: కార్యాచరణకు సీఎం చంద్రబాబు ఆదేశాలు..

### 'జలధార-జలహారతి' నిరంతరం



- ఎల్ నినో ప్రభావంతో 39 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం
- 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని సీఎం ఆదేశం
- తాగునీటి సరఫరా, పంటల రక్షణకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశం
- నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం

- మిగతా 2లో




## డీలిమిటేషన్‌పై తగ్గేదే లేదన్న విజయ్ సర్కార్..

### నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తీర్మానం

పెన్ పవర్ డెస్క్: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై విజయ్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోన్న డీలిమిటేషన్?కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం (ఆగస్ట్ 8) సీఎం విజయ్ నేతృత్వంలో జరిగిన తమిళనాడు ఎంపీల అఖిలపక్ష భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మహిళా

- మిగతా 2లో



## మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ..

### పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు?

- డీలిమిటేషన్ కు మద్దతు ప్రకటించిన సుఖ్‌బీర్ సింగ్ బాదల్
- గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన శిరోమణి అకాలీదళ్
- ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు

పెన్ పవర్ డెస్క్:శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన మరుసటి రోజే కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకు న్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు బాదల్ మద్దతు ప్రకటించారు. దీంతో, పంజాబ్‌లో బీజేపీ – అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తోందనే చర్చలు ఊపందుకున్నాయి.

- మిగతా 2లో

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

- తన భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిజీత్ డిప్కే
- అతిథులను కలవకుండా ఎస్ఐ అడ్డుకుంటున్నారని ఆరోపణ
- ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దంటూ అధికారిపై ఫైర్
- అతడిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు



పెన్ పవర్ డెస్క్:కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే

- మిగతా 2లో

## వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు హైకోర్టులో చుక్కెదురు!



- డెక్కన్ కిచెన్ ప్రాపర్టీ వివాదం
- నాంపల్లి కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో దగ్గుబాటి ఫ్యామిలీ పిటిషన్
- కేసును నాంపల్లి కోర్టులోనే తేల్చుకోవాలన్న హైకోర్టు

- మిగతా 2లో



## నేడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

- అనారోగ్య కారణాలతో ఇటీవల కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి
- పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించనున్న కేసీఆర్
- ఇప్పటికే పెద్ది కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించిన కేసీఆర్

పెన్ పవర్ డెస్క్:పార్టీ ఆవిర్భావం నుంచి తనకు అత్యంత ఆప్తుడిగా, ముఖ్య అనుచరుడిగా ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన కుటుంబాన్ని స్వయంగా పరామర్శించనున్నారు. ఇందుకోసం నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి రేపు ఆయన వెళ్లనున్నారు. ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో పార్టీ ఎల్లవేళలా తోడుగా ఉంటుందనే భరోసా ఇవ్వనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పెద్ది సుదర్శన్ రెడ్డి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది.
సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది.అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

## అమరావతి పనుల్లో అవినీతి? సీపీఐ నారాయణ తీవ్ర వ్యాఖ్యలు

అమరావతి రాజధాని నిర్మాణ పనులపై సీపీఐ అగ్రనేత కె. నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధానిలో పనులు వేగవంతంగా సాగుతుండటాన్ని ఆయన స్వాగతిస్తూనే, అదే స్థాయిలో అవినీతి కూడా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం అమరావతిలో నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని నారాయణ పేర్కొన్నారు. ఎల్ అండ్ టీ సంస్థ నిర్మిస్తున్న ఐకానిక్ టవర్లు అద్భుతంగా ఉన్నాయని, ఎన్‌సీసీ సంస్థ సచివాలయ నిర్మాణ పనులను చురుకుగా ముందుకు తీసుకెళుతోందని ఆయన కొనియాడారు. అయితే, గడిచిన పదేళ్ల కాలంలో రాజధాని నిర్మాణానికి తీవ్ర విఘాతం కలిగిందని విమర్శించారు. తొలి ఐదేళ్లలో ప్రాధాన్యతాలను గుర్తించకపోవడం వల్ల జాప్యం జరిగిందని, ఆ తర్వాతి ఐదేళ్లలో రాజధానికి తీరని నష్టం వాటిల్లిందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాల్లో భారీగా అవినీతి చోటుచేసుకుంటోందన్న వాదన బలంగా ఉందని, అవినీతి పునాదులు పటిష్ఠమయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. ద్రవ్యోల్బణం ప్రాతిపదికన అవినీతి అనధికారికంగా చట్టబద్ధమవుతోందంటూ విచారం వ్యక్తం చేశారు. ఏదేమైనా రాజధాని నిర్మాణాన్ని మాత్రం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మిగతా అంశాలను తెలివైన ప్రజలే చూసుకుంటారని, ప్రభుత్వం అనవసర విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదని ఆయన సూచించారు.

## కూటమి ప్రభుత్వానికి మద్దతుగా కర్నూలులో డీఎస్సీ విజేతల భారీ ర్యాలీ

- మొదటి పేజి తరువాయి
ఉపాధ్యాయ సంఘాలు ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. "థ్యాంక్యూ సీఎం సార్.. థ్యాంక్యూ లోకేశ్ సార్" అంటూ నినాదాలు చేస్తూ, తమ నియామకాలకు కారకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తాము ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివి, పూర్తి ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని స్పష్టం చేశారు. తమ నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, తాము ఎవరికీ లంచాలు ఇచ్చి ఉద్యోగాలు పొందలేదని అన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ తమపై, ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని, ఈ అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.మెగా డీఎస్సీ 2025 నియామకాలలో స్పోర్ట్స్ కోటా, పేపర్ లీక్ అంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలని, విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే, నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేదని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పలుమార్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలపై జరుగుతున్న కుట్రలను ఖండిస్తూ ఉపాధ్యాయులు స్వయంగా ర్యాలీ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎల్ నినో ముప్పు: కార్యాచరణకు సీఎం చంద్రబాబు ఆదేశాలు.. 'జలధార-జలహారతి' నిరంతరం

రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం అంచనాలకు మించి తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని, ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జల వనరుల పరిరక్షణ కోసం చేపట్టిన 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని ఇకపై ఒక నిరంతర కార్యక్రమంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, పంటల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపునకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన దిశానిర్దేశం చేశారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి.. జలధార-జలహారతి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

**39 శాతం లోటు వర్షపాతం.. తీవ్ర నీటి సంక్షోభం**

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే 39 శాతం తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో సాధారణంగా 867 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 525 మి.మీ. మాత్రమే కురిసే అవకాశం ఉందని అంచనాలను నివేదించారు. ముఖ్యంగా ఆగస్టు నెలలో లోటు 56 శాతానికి చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వర్షాభావ పరిస్థితుల ప్రభావం ఇప్పటికే రిజర్వాయర్లపై స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బేసిన్లలో కలిపి ప్రస్తుతం 563.05 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండగా, గతేడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేదని పోల్చి చెప్పారు. ఆగస్టు నుంచి భూగర్భ జలమట్టాలు కూడా వేగంగా పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

**తాగునీటి సరఫరాకే అగ్ర ప్రాధాన్యం**

ఎల్ నినో తీవ్రత దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి వంటి రిజర్వాయర్లలో తాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా నీటిని నిల్వ చేయాలని సూచించారు. నాగార్జున సాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాల తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులపై వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని ఒడిసి పట్టుకుని, ప్రాజెక్టులను వీలైనంత మేర నింపాలని దిశానిర్దేశం చేశారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు.

**పంటలు, పశుసంపద రక్షణకు చర్యలు**

వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రాధాన్యతా క్రమంలో నీటిని విడుదల చేయాలని సీఎం సూచించారు. భవిష్యత్తులో తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని చెప్పారు. అదే సమయంలో, పరిశ్రమలకు కూడా నీటి కొరత లేకుండా చూడాలన్నారు. పశు గ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల గోకులాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి వినియోగం, పొదుపుపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని కోరారు.
ఈ సమీక్షలో అధికారులు 'జలధార-జలహారతి' కార్యక్రమ పురోగతిని సీఎంకు వివరించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.3,409.35 కోట్ల అంచనాతో 82,865 పనులు గుర్తించగా, ఇప్పటికే 79,826 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్ల వంటి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, నీటిపారుదల, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటా జాతీయ జెండా..

- మొదటి పేజి తరువాయి
అనే భావన ప్రతి ఒక్కరిలోనూ కలిగించాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ప్రజలు కేవలం ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, రాష్ట్ర భవిష్యత్ నిర్మాణంలో కీలక భాగస్వాములుగా (స్టేక్‌హోల్డర్లు) మారాలని చంద్రబాబు ఆకాంక్షిం చారు. "రాష్ట్ర, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత, విద్యార్థుల శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలి. వారి ఆలోచనలకు, ఉత్సాహానికి సరైన వేదిక కల్పించాలి. గ్రామస్థాయి నుంచి నాయకత్వ లక్షణాలున్న వారిని ప్రోత్సహించాలి. ఒకప్పుడు గ్రామాల్లో ఉన్న స్వచ్ఛంద సేవా స్ఫూర్తిని పునరుద్ధరించడానికి ఈ కార్యక్రమం దోహదపడాలి" అని ఆయన వివరించారు.
2047 లక్ష్యాల సాధన దిశగా ఏటా సాధించిన ప్రగతిపై ప్రతి ఆగస్టు 15న నివేదికలు సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని
ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.
ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పలువురు ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రపంచం ఎలా మారుతుందో చెప్పలేం.. కానీ, గెలవాలంటే..!

ప్రపంచం వేగంగా మారుతోంది.. టెక్నాలజీతో పాటు ఉద్యోగాలు, పరిశ్రమలు కూడా కొత్త రూపం దాలుస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రయాణంలో ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండేవారే భవిష్యత్తులో విజయం సాధిస్తారని అన్నారు.ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో శనివారం మోదీ ప్రసంగించారు. ప్రపంచంలో వ్యూహాత్మక మార్పులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. టెక్నాలజీ అభివృద్ధి ఈ మార్పులకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాబోయే 20-30 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందో కచ్చితంగా చెప్పలేమన్నారు. అయితే మార్పులు సవాళ్లతో పాటు కొత్త అవకాశాలను కూడా తీసుకొస్తాయని తెలిపారు.ప్రస్తుత తరం యువతకు ప్రత్యేక బాధ్యత ఉందని మోదీ అన్నారు. వచ్చే 30-35 ఏళ్లలో వారు తీసుకునే నిర్ణయాలు 'వికసిత్ భారత్' ప్రయాణంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎలా ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని సూచించారు.పరిశోధన, కొత్త ఆలోచనల్లోనూ యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని మోదీ చెప్పారు. ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ పథకం ద్వారా యువ పరిశోధకులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ పరిశోధనా సంస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. పరిశోధన రంగానికి రూ.1 లక్ష కోట్ల వరకు నిధులు సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్' ద్వారా ప్రముఖ అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ దేశంలోని చిన్న పట్టణాలకూ అదనపు ఖర్చు లేకుండా అందుతున్నాయని మోదీ తెలిపారు. ఐఐటీ ఢిల్లీలో 3,000 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు అందించారు. ఇందులో 587 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు.అదే కార్యక్రమంలో ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరమ్ ప్రజ్ఞ' ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ సదుపాయాన్ని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది ఏఐ, డేటా సైన్స్, ఆధునిక కంప్యూటింగ్, పరిశోధనకు ఉపయోగపడనుంది.

# వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉంది:

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతా రెడ్డి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. తన తండ్రి హత్యకు గురై ఏడేళ్లకు పైగా గడిచినా తమ కుటుంబానికి ఇంతవరకు పూర్తి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉందని ఉద్ఘాటించారు. కేసు దర్యాప్తులో వెలుగు చూడని అనేక కీలక అంశాలను వెలికితీయాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆమె తన లేఖలో కోరారు.ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన సీబీఐ దర్యాప్తు, తదనంతర పరిణామాలను సునీత తన లేఖలో రాష్ట్రపతికి వివరించారు. హత్య జరిగి ఇన్నేళ్లయినా నేటికీ హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేకపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హత్య వెనుక ఉన్న పెద్ద కుట్రను, కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీల కోణాన్ని సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో కొన్ని కీలకమైన అంశాలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు దిశ, ఈనాడు పత్రికలు కథనాలు ప్రచురించాయి.ముఖ్యంగా, వివేకా హత్య వార్త బయటకు రాకముందే అప్పటి ప్రతిపక్ష నేత జగన్ కు ఎలా తెలిసిందనే అంశాన్ని లోతుగా దర్యాప్తు చేయాలని సునీత కోరారు. ఈ విషయంలో జగన్ పాత్రపై విచారణ జరపాల్సి ఉందని 2023 మే 25న సీబీఐ స్వయంగా హైకోర్టులో దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌ను ఆమె తన లేఖలో ఉటంకించారు. ఈ కీలక అంశాన్ని ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను (సిట్) ఏర్పాటు చేసినా, ఆ తర్వాత సీబీఐ నాలుగు చార్జిషీట్లు దాఖలు చేసినా, కేసులో లోతైన దర్యాప్తు జరగలేదనే భావనను ఆమె వ్యక్తం చేశారు.తాను న్యాయస్థానాల విచారణలో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని, దర్యాప్తులో ఇప్పటివరకు బయటకు రాని వాస్తవాలను వెలికితీయాలన్నదే తన ఉద్దేశమని సునీత స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తును డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) లేదా కేంద్ర హోం మంత్రిత్వ శాఖలోని అధికారికి బదిలీ చేయాలని అభ్యర్థించారు. నిర్ణీత కాలపరిమితిలో దర్యాప్తును సంతృప్తికరంగా ముగించి, వాస్తవాలను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం, న్యాయ శాఖ మంత్రులు, ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలకు కూడా ఆమె ఈ లేఖ ప్రతులను పంపారు. ఏడేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నామని, ఇకనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు సునీత తన లేఖలో పేర్కొన్నారు.

## వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు హైకోర్టులో చుక్కెదురు!

టాలీవుడ్ ప్రముఖులు దగ్గుబాటి వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫిల్మ్‌నగర్‌లోని ప్రసిద్ధ 'డెక్కన్ కిచెన్' ప్రాపర్టీ వివాదానికి సంబంధించి నాంపల్లి కోర్టులో తమపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజీ తిరస్కరించారు. వెంకటేశ్, సురేశ్ బాబు, రానాతో పాటు దగ్గుబాటి అభిరామ్, అకౌంటెంట్ గడ్డం విశ్వనాథమ్‌లు సమర్పించిన రద్దు (క్వాష్) పిటిషన్‌లో ఎలాంటి బలమైన కారణాలు లేవని స్పష్టం చేస్తూ కొట్టివేశారు.
లీజు గడువు ముగియకముందే దగ్గుబాటి కుటుంబం జీహెచ్ఎంసీ అధికారులతో కుమ్మక్కై తమ ప్రాపర్టీలోకి అక్రమంగా ప్రవేశించిందని, అక్కడి నిర్మాణాలను బలవంతంగా కూల్చివేసి బెదిరింపులకు దిగారని కోరె నందు కుమార్ గతంలో కేసు పెట్టారు. ఇది కేవలం లీజుకు సంబంధించిన సివిల్ వివాదమని, క్రిమినల్ కేసు కాదని నిందితులు వాదించినప్పటికీ... ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు చట్టబద్ధమైన ప్రాతిపదిక లేదని స్పష్టం చేసిన హైకోర్టు, నాంపల్లి కోర్టులోని విచారణ కొనసాగేలా ఆదేశించింది.

## నేడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

- మొదటి పేజి తరువాయి
కుటుంబంతో పాటు నర్సంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలిసి కేసీఆర్ ధైర్యం చెప్పనున్నారు. కాగా, ఇప్పటికే పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## డీలిమిటేషన్‌పై తగ్గేదే లేదన్న విజయ్ సర్కార్..

- మొదటి పేజి తరువాయి
రిజర్వేషన్ బిల్లుతో ముడిపెడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోన్న డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చించేందుకు రాష్ట్ర ఎంపీలతో సీఎం విజయ్ (ఆగస్ట్ 8) అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే, అన్నాడీఎంకే, పీఎంకే, ఎండీఎండీకే బహిష్కరించాయి. అధికార టీవీకే కూటమికి చెందిన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఐ(ఎం), ఎండీఎంకే, ఐయూఎంఎల్ పార్టీల ప్రతినిధులు మాత్రమే ఈ సమావేశంలో పాల్గొన్నారు. లోక్ సభ, రాజ్య సభలో రాష్ట్రానికి చెందిన మొత్తం 57 మంది ఎంపీలలో 37 మంది ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. రాబోయే 40 నుంచి 50 ఏళ్ల వరకు ప్రజాప్రతినిధుల స్థానాల్లో ఎలాంటి మార్పులు చేయొద్దని.. ప్రస్తుతమున్న లోక్‌సభ స్థానాల సంఖ్యను అలాగే కొనసాగించాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ఒకవేళ డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టిన 1971 జనాభా లెక్కల ప్రకారమే చేయాలని డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన తమిళనాడు లాంటి ప్రగతిశీల రాష్ట్రాల పార్లమెంటు ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అన్యాయమని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

## మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు?

- మొదటి పేజి తరువాయి
ప్రధానితో జరిగిన భేటీ సానుకూలంగా జరిగిందని, పంజాబ్ అభివృద్ధి, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.
గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్, ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మళ్లీ కమలం పార్టీతో జతకట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పునర్విభజనపై కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు పలకడం కూడా ఈ పొత్తు సంకేతాలలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ పంజాబ్ రాజకీయాల్లో కొత్త మైత్రికి దారితీస్తుందనే చర్చలు జోరందుకున్నాయి.

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి
అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు.
వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,"నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అనుమతించడానికి మీకేంటి ఇబ్బంది? ఢిల్లీ పోలీసుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదు, మిమ్మల్ని ఇప్పుడే మొదటిసారి చూస్తున్నాను. నేను ఎవరిని కలవాలి, ఎవరిని కలవకూడదు అనేది మీరు నిర్ణయించలేరు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, మీరు నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది.మరో వీడియోలో ఆయన ఓ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, "సురేశ్ అనే ఎస్ఐ ఇక్కడ చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారా? ఆయన నాకు వద్దు, వెంటనే ఇక్కడి నుంచి తొలగించండి" అని కోరారు.అంతేకాకుండా, రాష్ట్ర సీఐడీకి చెందిన సిబ్బంది మఫ్టీలో తన ఇంటి పరిసరాల్లో ఉంటూ 'హిట్ స్ప్రే' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓ విలేకరి ఒక అధికారి ఫోన్‌లో ఈ గ్రూప్‌ను గమనించారని ఆయన పేర్కొన్నారు.

# అద్దంకి పోలీస్ స్టేషన్ లో 10న ఎస్పీ 'మీకోసం'

### బాధితులకు తక్షణమే చట్టపరమైన న్యాయం

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 08:**
ప్రకాశం జిల్లా, అద్దంకి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 10వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఈ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసి అందజేయాలని ఎస్పీ సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి,



వాటి పరిష్కారానికి చట్టపరంగా తగిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అద్దంకి పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు కోరారు.

# పెన్ పవర్
## మార్కాపురం - ప్రకాశం

# కోర్ శాఖల్లో వంద శాతం ఉద్యోగ అవకాశాలు

### -ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలకు మరో ఘనత



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 8**
ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) ఉద్యోగ నియామకాలలో మరో ఘనత సాధించింది. కళాశాలలో గతంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలతో పాటు ఇటీవల నిర్వహించిన రెండు దశల నియామక ప్రక్రియల ఫలితంగా విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్స్, విద్యుత్ ఇంజినీరింగ్, యాంత్రిక ఇంజినీరింగ్ వంటి ప్రధాన ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అర్హత కలిగిన మొత్తం 122 మంది విద్యార్థులందరూ ఉద్యోగాలు సాధించారు. దీంతో చివరి సంవత్సరం మొదటి అర్ధ సంవత్సరంలోనే ఆయా ప్రధాన విభాగాల్లో వంద శాతం ఉద్యోగ నియామకాలను కళాశాల నమోదు చేసింది. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో పుణేకు చెందిన రోంచ్ పాలిమర్స్ సంస్థలో 33 మంది విద్యార్థులు, ఔరంగాబాద్‌కు చెందిన లక్ష్మీ అగ్ని భాగాలు మరియు మలచిన లోహాల సంస్థలో 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ పొందిన ఇంజినీర్లుగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు సంవత్సరానికి రూ.3 లక్షల వేతనం అందించనున్నట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలను అందిస్తూ, వారిని ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నందువల్లే ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. విద్యాభ్యాసం పూర్తికాకముందే ప్రధాన ఇంజినీరింగ్ విభాగాల్లో వంద శాతం ఉద్యోగ నియామకాలు సాధించడం కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు సాంకేతిక శిక్షణ, పరిశ్రమలతో అనుసంధానం, ప్రత్యేక ఉద్యోగ సన్నద్ధత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటి ఫలితంగానే విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రముఖ సంస్థలను కళాశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ఉప ప్రిన్సిపాల్ హరి బాబు, విద్యా వ్యవహారాల బాధ్యులు మీరావలి, శిక్షణ మరియు ఉద్యోగ నియామకాల అధికారి సాహిత్య, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థుల భవిష్యత్ మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

# మాలకొండలో జవాన్ల హవా..!

**కొండ కొచ్చిన భక్తులపై చిర్రు బుర్లు**

**జవాన్ల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు**

**స్వామి అనే పిలుపు మాయం**

**మాలకొండ లో గజిబిజి గందరగోళం**





**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఆగస్టు 8**
అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతి శనివారం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వస్తుంటారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని ఎప్పటికప్పుడు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులకు సూచనలు సలహాలు ఇస్తున్నారు. ఆలయ అభివృద్ధికి తొలిమెట్టు భక్తులేనని వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని దేవస్థానాన్ని సందర్శించిన పలు సందర్భాల్లో చెప్పారు. అయితే ఆలయంలో పనిచేసే జవాన్లు అవేవి పట్టనట్టు మాలకొండ కు వచ్చే భక్తులపై చిర్రుబుర్రులాడడంతో భక్తులు సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఒకటి. దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసాలు పడి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్శనానికి వెళ్లే సమయంలో క్యూ దగ్గర ఉన్న సిబ్బంది, సేవ పేరుతో వచ్చిన కొందరు భక్తులపై పెత్తనాలు చెలాయించడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దేవాలయానికి వచ్చిన భక్తులను మర్యాద పూర్వకంగా గౌరవంగా పలకరించకుండా అసభ్యకర పదజాలంతో మాట్లాడుతున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దగా కేకలు వేస్తూ క్యూలో భక్తులను కేకలు వేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వారి పని పనితీరుపై మండిపడుతున్నారు. ఇలాంటి సంస్కృతి రాష్ట్రంలో ఏ దేవాలయాల్లో కూడా లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడెక్కడ నుంచో ఎంతో కష్టపడి దర్శనానికి వస్తే ఇటు ఆలయ సిబ్బంది, అటు సేవ పేరుతో వచ్చిన కొందరు మాత్రం భక్తులపై చిరుబుర్లు ఆడటం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. భక్తులే ఆలయానికి" నిధి" అని ఆ సిబ్బంది గుర్తించడం లేదు. అయినప్పటికీ ఆలయ అధికారులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో భక్తులు ఆ సిబ్బంది పనితీరుపై తీవ్రంగా ఆవేదనకు గురవుతున్నారు. ఎంతో ఆధ్యాత్మికంగా ఉండాల్సిన ఆలయంలో కేకలు, ఓయ్, రోయ్ అనే పదజాలంతో మాట్లాడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

**స్వామి అనే పథం మాయం...**

గతంలో దేవస్థానానికి వచ్చే భక్తులందరినీ "స్వామి" అని గౌరవప్రదంగా పిలచే వారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి ఆలయంలో కనిపిం చడం లేదు. స్వామిని చూడాలని ఎంతో ఆశతో చాలాదూరం నుంచి వచ్చి కంటితో చూసి దర్శించుకునే అవకాశం లేదని అంటున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు సిబ్బంది తీరు బాగో లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**పనితీరుపై చర్యలు తీసుకోవాలి...**

సేవ పేరుతో వచ్చిన భక్తులకు, దేవస్థానం లో కొత్తగా చేరి పనిచేస్తున్న సిబ్బందికి భక్తుల పట్ల ఎలా మెలగాలో ఆలయ అధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్నారు . దేవాలయంలో ఇంతకుముందు ఉన్న సిబ్బంది పలు కార ణాల చేత తీసివేయడం జరిగింది. అయితే వారి స్థానంలో అధికార పార్టీ చెందిన నేతలు వారికి అనుకూలమైన వారిని కొండపైన చేర్చారు. అయితే కొత్తగా చేరిన వారికి దేవస్థానంలో భక్తుల పట్ల ఎలా ప్రవర్తించాలనే విషయం తెలియడం లేదు. చాలా మంది జవాన్లు తమ సొంత పనులు, సెల్ ఫోన్లు కి పరిమితమై భక్తులతో ఎలా మెలగాలనేది అవగాహన లేదు. దేవస్థాన అధికారులు కొత్త గా చేరిన వారికి దేవస్థానానికి వచ్చే భక్తుల పట్ల ఎలా ప్రవర్తించాలనే విషయం పై అవగాహన కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

**నడిచొచ్చే భక్తులకు దారెక్కడ!**

కొండ కింద నుంచి మెట్ల మెట్ల పూజ చేసుకోని మార్గంలో నడిచొచ్చే భక్తులకు కొండపైకి వచ్చిన తర్వాత దేవాలయంలో కి వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ల మార్గంలో నడిచొచ్చే భక్తులకు రాకపోకలకు అడ్డంగా ద్విచక్ర వాహనాలు పెట్టడంతో ఎటు నడవాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య ఆలయ అధికారులకు కళ్ళెదుట కనిపిస్తున్న పట్టించుకోవడం లేదు.

# ఒంగోలు సుందరీకరణపై కలెక్టర్ దృష్టి

**- నగరంలో విస్తృతంగా పర్యటించిన రాజాబాబు**

**- చేపట్టాల్సిన పనుల ప్రత్యక్ష పరిశీలన**





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 08**
ఒంగోలు నగర సుందరీకరణ పై కలెక్టర్, కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ పి. రాజాబాబు ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ఆయన నగరంలో విస్తృతంగా పర్యటించి సుందరీ కరణ, అభివృద్ధి పరంగా చేపట్టాల్సిన చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి వచ్చే నెలాఖరుకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాలలో స్వాగత ఆర్చీలు, కూడళ్లలో ప్రముఖుల విగ్రహాలు, ఒంగోలు నగర చారిత్రక నేపథ్యం - విశిష్టతను తెలిపేలా పెయింటింగ్, పచ్చదనం పెంపు, ఆర్ట్ గ్యాలరీలు, ప్రముఖుల చిత్రాలతో ఫేమ్ వాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఒంగోలు ఎంపీ, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకొని ఈ ప్రణాళికను మూడు రోజుల్లో విడుదల చేస్తామన్నారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లా పరిపాలనా కేంద్రమైన ప్రకాశం భవనంలో కూడా అవసరమైన మరమ్మతులు చేపట్టామన్నారు. ఒంగోలు చరిత్రలో చిరస్థాయిలో నిలిచేలా ఈ మొత్తం కార్యక్రమాలు నిర్వహించడం పై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, మున్సిపల్ ఇంజనీర్ ఏసయ్య, ఇతర అధికారులు ఉన్నారు.

# రూ.10 లక్షల ప్రమాద భీమా చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే ముత్తుముల..





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**
గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు, గిద్దలూరు మండలాలకు చెందిన ఇద్దరూ టీడీపీ కార్యకర్తలు ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆ రెండు కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ కల్పించిన ప్రమాద భీమా ద్వారా మంజూరైన రూ. 10 లక్షల రూపాయల చెక్కులను గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అందజేశారు.. కొమరోలు మండలం, బాదినేనిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎర్రి మధు రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆయన సతీమణి ఎర్రి ప్రమీల కు రూ. 5,00000-00 లు, చెక్కును, గిద్దలూరు మండలం, కృష్ణంశెట్టి పల్లె గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త భూపని తిరుమలయ్య రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆయన సతీమణి ఉమా కి రూ. 5,00000 /- చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్దను కోల్పోయిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచి ఆర్థిక భరోసానిచ్చేందుకు, గౌ. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , యువనాయకులు నారా లోకేష్ ప్రమాద భీమా సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు. తమకు ఎటువంటి అవసరం వచ్చిన తనను సంప్రదించాలని, తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుబాధిత కుటుంబాలు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కొమరోలు, గిద్దలూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఛాలెంజ్ స్వీకరిస్తాం మునిసిపల్ ఎలక్షన్ కి వెళ్దాం



**లోకేష్ రాజీనామా చేయాలి**

**డీఎస్సీ అక్రమాలను అసెంబ్లీలో ఎండగడతా**

**ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు**

**మూడో రోజు కొనసాగిన రిలే దీక్షలు**

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 8**
కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ--2025 టీచర్ పోస్టుల నియామకాల్లో జరిగిన అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కందుకూరు సబ్ - కలెక్టర్ కార్యాలయం ఎదురుగా మూడవరోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దీక్షల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత, డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి విద్యార్థులు యువకులకు మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ డీఎస్సీ--2025 నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలు రాష్ట్రంలోని నిరుద్యోగ యువత భవిష్యత్తును అగమ్య గోచరంగా మార్చిందని విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే విద్య మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేసి సిబిఐ ఎంక్వయిరీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే కౌన్సిల్ సమావేశంలో డీఎస్సీలో జరిగిన అక్రమాలపై ఆధారాలతో సహా బయట పెడతామని అన్నారు. కందుకూరు ఎమ్మెల్యే అవ్వటానికి పదో తరగతి అర్హత సరి పోతుంది గాని నిరుద్యోగ యువతకు సంఘీభావంగా దీక్షలో కూర్చోవడానికి ఏ అర్హత కావాలో చెబితే బాగుంటుందని సున్నితంగా విమర్శించారు. ఈ మధ్యకాలంలో ఎమ్మెల్యే చేసిన సవాలును మేము స్వీకరిస్తున్నామని ఎన్నికలకు వెళ్లి ప్రజా తీర్పుకోరుదామని అన్నారు.జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రామాయపట్నం పోర్టు, పొగాకు రైతుల మద్దతు ధర పోరు కొనసాగిస్తామని తెలిపారు.దీక్షా శిబిరం ముగింపు సందర్భంగా జరిగిన సభలో జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ట్రోల్ చేసుకుంటూ వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారని ఇది వారికి సరైనది కాదని అన్నారు. బుర్రా మధుసూదన్ యాదవ్ ఎమ్మెల్యే మున్సిపల్ ఎన్నికలకు వెళ్దామా అని సవాలు విసిరితే విలీన గ్రామాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి అలాగే వెళ్దాం అని మాట్లాడినందుకు టిడిపి సోషల్ మీడియా కామెడీ స్టార్ అని, పెట్రోలు ఉంది కదా కారేసుకుని వచ్చి మైక్ దొరికితే మాట్లాడటం కాదని వారికి వారే విమర్శలు చేసి రాక్షస ఆనందం పొందుతున్నారు. నియోజకవర్గ ప్రజల పక్షాన సాక్షాదారాలతో మీరు చేసే చౌక బియ్యం దందాలు, మట్టి మాఫియా, మద్యం ఏరులై పారిస్తుంటే ప్రశ్నిస్తున్నందుకు మీ దగ్గర ఎటువంటి సమాధానాలు లేక వ్యక్తిగత ఆరోపణ చేస్తూ ఆనందపడుతున్నారు. మీ అక్రమాలను అన్యాయాలను నియోజకవర్గంలో ఎండగడుతున్న బుర్రా కామెడీ స్టార్ కాదు సూపర్ స్టార్ అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని పార్టీని నిర్మాణం చేస్తున్న సామాజిక న్యాయానికి కట్టుపడ్డ వ్యక్తి బుర్రా మధుసూదన్ యాదవ్ అని అన్నారు.



కనిగిరిలో గ్రామాలను కలిపి నగర పంచాయతీగా మార్చింది ఉగ్ర నరసింహారెడ్డి అయితే ఆ విషయాలను కూడా తెలుసుకోకుండా స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు నూటికి వచ్చిందే మాటగా మాట్లాడుతున్నారని అన్నారు. కనిగిరి నియోజకవర్గం అభివృద్ధిలో కష్టపడ్డ కార్యకర్తలు నాయకులకు అప్పటి ప్రభుత్వంలో గుర్తింపు కలిగిన పదవులను కట్టబెట్టి, ఒక ఎస్సీ ని ఏఎంసీ చైర్మన్ ని చేసి, ఒక ముస్లిం మైనార్టీ ని మున్సిపల్ చైర్మన్ గా చేసిన ఘనత బుర్రాదేనని అన్నారు. మూడవ రోజు జరిగిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు,తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి,ముప్పవరపు కిషోర్, బద్దిపూడి జయరావు, ఎంపీపీ పులి రమేష్, నలమోతు చంద్రమౌళి, పాలవల్లి అమర్నాథ్ రెడ్డి, మద్దసాని నవీన్ కృష్ణ, ఆవుల మాధవరావు, ఎస్ కే సందాని, అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, తల్లపనేని గోపి, యడ్ల మాధవరెడ్డి, చింతలపూడి సురేష్, షేక్ రహీం, దగ్గుమాటి కళ్యాణ్, నక్కా విజయ్ కుమార్ ఆదిలక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ 6 వ తరగతి ప్రవేశ పరీక్షకు గడువు ఆగస్టు 10 వరకు పొడిగింపు

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 08**




ఒంగోలు జవహర్ నవోదయ పాఠశాలలో 6 వ తరగతికి అడ్మిషన్లకు నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగిం చారని ప్రిన్సిపల్ సి.శివరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లా పరిధిలో 5 వతరగతి చదువుతున్న విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ అడ్మిషన్లకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2027–28వ సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 10 వ తేదీ వరకు గడువు పొడిగించారన్నారు. ఈ నెల 11,12 తేది లలో దరఖాస్తు పత్రాలలో ఏమైనా తప్పులు ఉంటే సవరణకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## తులసమ్మ భౌతికాయానికి నివాళులర్పించిన మంత్రి స్వామి





**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 8**

మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు గారి తల్లి తులసమ్మ( 96) శనివారం మృతి చెందారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి తులసమ్మ పార్థివ దేహానికి నివాళు లర్పించారు. అనంతరం మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావును కుటుంబ సభ్యులను పరామర్శించారు ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రపాటి రామయ్య చౌదరి, మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు, మన్నేం రమణయ్య, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, దాసరి కృష్ణారావు, మన్నెం మల్లికార్జునరావు, పల్లపోతు వెంకట్రావు, కోటేశ్వరరావు, సురేంద్ర, మాధవరావు, వెంకటేశ్వర్లు, నరాల గంగయ్య, మల్లికార్జున రావు తదితరులు ఉన్నారు.

## సంవజంలోనైతిక విలువలు పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**

సమాజంలో యువతను వ్యసనాలకు దూరంగా ఉంచి, వారిలో నైతిక విలువలను పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణ బాబు పేర్కొన్నారు గిద్దలూరు పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం గిద్దలూరు శాఖ కేంద్రంలో శనివారం నషా ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా రూపొందించిన అవగాహన పోస్టర్లు, ప్రతిజ్ఞ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణ బాబు తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం అవగాహన, ప్రతిజ్ఞ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం గర్వకారణం మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువతను మాదక ద్రవ్యాలు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు . 14 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల యువత కోసం "ఒక్కటే మనం -- యువ సంకల్పం అభియాన్" పేరుతో బ్రహ్మకుమారీస్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు యువతలో సత్ప్రవర్తన, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు.. విజయ, సరస్వతి, స్రవంతి , యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించాలి

**నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంత్రి పదవికి రాజీనామా చేయాలి.**

**ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి బకాయిలతో సహా చెల్లించాలి.**

**కొమరోలు లో నిర్వహించిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ శాసనసభ్యులు కుందూరు నాగార్జున రెడ్డి .**






**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 8**

2025 మెగా డీఎస్సీలో జరిగిన దగా మోసాలపై సిబిఐతో తక్షణమే విచారణ జరిపించాలని, డీఎస్సీ లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయలు చొప్పున నిరుద్యోగ భృతి బకాయిలతో సహా చెల్లించాలని గిద్దలూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు,గిద్దలూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మార్కాపురం మాజీ శాసనసభ్యులు కుందూరు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రమైన కొమరోలులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటీ సభ్యులు సారే వెంకట నాయుడు, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి, మండల వైసీపీ సమన్వయకర్త మేరీగా రవికుమార్ తదితర నేతల నాయకత్వంలో వైసీపీ శ్రేణులు కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ కార్యక్రమానికి జిల్లా వైసీపీ ప్రచార కమిటీ సమన్వయకర్త చెదుల్ల వెంకటరమణారెడ్డి అధ్యక్షత వహించగా, గిద్దలూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి, కొమరోలు మండలం వైసిపి పరిశీలకులు,బేస్తవారిపేట మండల అధ్యక్షులు ఓ సూరారెడ్డి, బేస్తవారిపేట మండల వైసీపీ కన్వీనర్ అవుల శ్రీధర్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కుందూరు నాగార్జున రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించి దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఎంతో పవిత్రమైందని, అలాంటి విద్యా శాఖకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ డీఎస్సీ లో అక్రమాలకు తెర లేపి కళంకం తెచ్చారని విమర్శించారు. నిరుద్యోగులకు డీఎస్సీ రాత పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా పారదర్శకంగా మెరిట్ ఆధారంగా వారికి ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు పంపించవలసి ఉండగా, 2025 డీఎస్సీలో గతంలో ఉన్న స్పోర్ట్స్ కోటాను పెంచుతూ జీవో జారీ చేసి లంచాలకు ఒడిగట్టి అక్రమ మార్గంలో తమకు అనుకూలమైన తెలుగుదేశం పార్టీకి చెందిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి విద్యా శాఖకే మాయని మచ్చ తెచ్చారని ఆయన విమర్శించారు.ఎలాంటి రాత పరీక్షలు లేకుండానే తమ కు అనుకూలమైన వారికి, లక్షల రూపాయల లంచం ఇచ్చిన వారికి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని కట్టబెట్టారని విమర్శించారు. ఆ సందర్భంగా వెలుగు చూసిన వీడియో ఆడియోల ద్వారా డీఎస్సీ లో జరిగిన అక్రమాలను నిలదీస్తూ రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించాలని, డిమాండ్ చేస్తుండగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందుకు భయపడుతూ, తన కుమారుడిని రక్షించుకునేందుకు చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ అవలంబిస్తూ, దీక్ష శిబిరాలపై దాడులు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు సిబిఐతో విచారణ జరిపించాలని, అక్రమంగా ఉపాధ్యాయ పోస్టులు పొందిన వారిని తొలగించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు 3000 రూపాయలు చొప్పున గత రెండు సంవత్సరాల బకాయిలతో సహా తక్షణమే చెల్లించాలని. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు వెంటనే చెల్లించి విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా కింద పేకాట కూడా ఒక క్రీడగా చిత్రీకరించి వారికి అనుకూలమైన నిరుద్యోగులకు దొడ్డి దారిన ఉద్యోగాలు కల్పించడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సిజెపి నాయకత్వంలో ఢిల్లీలో నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేయగా నీట్ పరీక్షలు జరిగిన అక్రమాలకు నైతిక భవిత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేశారని, అదే విధంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా డీఎస్సీ లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బేస్తవారిపేట మండల అధ్యక్షులు ఓ సూరారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, తల్లి తరువాత గురువు స్థానం దైవం లాంటిదని అలాంటి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని కళంకం చేస్తూ ఎలాంటి విద్యార్హతలు లేని నిరుద్యోగులకు దొడ్డి దారిన ఉద్యోగాలు కల్పించి విద్యా శాఖ మాయని మచ్చ తెచ్చారని అంటూ, ఉపాధ్యాయుడు అనే పదంలోని ఒక్కొక్క అక్షరానికి ఆయన నిర్వచనం చెప్పారు. జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు మాట్లాడుతూ, గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను తెచ్చి ఒకే పర్యాయం 1,30,000 ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించారని, ఆ సందర్భంగా ఎలాంటి అక్రమాలు అవినీతి లేకుండా పారదర్శకంగా నిరుద్యోగుల విద్యార్హత రాత పరీక్షల్లో వారు సాధించిన మార్కులు ఆధారంగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి దేశ చరిత్రలోనే ఆంధ్ర రాష్ట్రానికి వన్నె తెచ్చారని ఆయన పేర్కొన్నారు. కేవలం 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీ లో అక్రమాలకు పాల్పడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా శాఖ కే కళంకం తెచ్చారని ఆయన విమర్శించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చెదుల్ల వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు గాలికి ఎగిరిపోయాయని దీనితో రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత రోజురోజుకు పెరిగిపోతుందని, అమలుకు చేయలేని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు ఉపన్యసిస్తూ మెగా డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన మంత్రి పదవి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్ష శిబిరానికి కొమరోలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి భారీ సంఖ్యలో వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరాగా, రిలే నిరాహార దీక్షలలో దాదాపు 150 మంది పాల్గొన్నట్లుగా కుందూరు నాగార్జున రెడ్డి తెలియజేస్తూ, వారందరినీ అభినందించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు ఎస్ఎం సుభాని,ఎం తిరుపతి రాజు, సారే సుజాత, మండల వైసీపీ జేఏసీ కన్వీనర్ వీ. మోహన్ రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు బంగారు విశ్వరూపం, జిల్లా వైసీపీ బీసీ విభాగం సమన్వయకర్త సారే జనార్ధన్ నాయుడు, ఎడమ కళ్ళు ఎంపీటీసీ సభ్యులు వాసుదేవ రెడ్డి, మాజీ సర్పంచులు ముత్తుముల జయరామిరెడ్డి, బాధర్రెడ్డి,వెంకటేశ్వర్లు, గుడిపాటి ప్రదీప్,భూమా రమణమ్మ, వైజా నారాయణరెడ్డి, వైసీపీ నేతలు దొనపాటి ఆంజనేయులు, గుడిపాటి ప్రసాద్, గోల్కొండ అబ్దుల్ సత్తార్, మజీద్ ,బండారి శిరీష, మండల వైసిపి సోషల్ మీడియా ప్రతినిధి రామాయణపు పవన్ కళ్యాణ్, ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన తిరుమలయ్య భాస్కర్ తో పాటు పలువురు వైసిపి నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తల అభిమానులు పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక మోస్తరు వర్షం కురిసినప్పటికీ దీక్షాపరులు పట్టుదలతో దీక్షను కొనసాగించారు. సాయంత్రం ఐదు గంటలకు దీక్షాపరులకు కుందూరు నాగార్జున రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. రిలే నిరాహార దీక్ష కార్యక్రమం విజయవంతం అగుటకు సహకరించిన మండలంలోని వైసీపీ నేతలు,కార్యకర్తలు, అభిమానులను, నిరుద్యోగులు విద్యార్థులను జడ్పిటిసి వెంకట నాయుడు మండల సీనియర్ వైసీపీ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి, మండల కన్వీనర్ మేరీగా రవికుమార్ ఎంపీటీసీలు షేక్ మౌలాలి ఎస్ఎం సుభాని తిరుపతి రాజు తదితరులు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

# గెస్ట్‌హౌస్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**-ఐదుగురు అరెస్ట్.. రూ.24,590 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం**



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 8**

కందుకూరు పట్టణంలోని మాల్యాద్రి కాలనీలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 24,590 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కందుకూరు డీఎస్పీ సూచనలతో కందుకూరు సీఐ ఆధ్వర్యంలో కందుకూరు రూరల్ ఎస్సై, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. మాల్యాద్రి కాలనీలోని శ్రీనివాస గెస్ట్‌హౌస్‌లో గల 104వ గదిలో పేకాట నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు అక్కడ ఆకస్మికంగా దాడి చేశారు.ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**జూద క్రీడలపై కఠిన చర్యలు...**

ఈ సందర్భంగా కందుకూరు డీఎస్పీ మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు, ఇతర జూద క్రీడలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూద క్రీడలను నిర్వహించే స్థావరాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# బోండా నీ నోరు అదుపులో పెట్టుకో

**వైస్సార్సీపీ ఆర్యవైశ్య నాయకుల ఆగ్రహం**





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్టు 8**

రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసులు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా నోరు అదుపులో పెట్టుకోవాలని, యర్రగొండపాలెం వైస్సార్సీపీ ఆర్యవైశ్య నాయకులు ఘాటుగా విమర్శించారు. శనివారం దీక్ష శిబిరం వద్ద ఆర్య వైశ్య నాయకులు ఇమ్మడి శెట్టి వెంకట సుబ్బారావు, ఇమ్మడి శెట్టి సత్యనారాయణ, సురే వెంకట స్వామి, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాథ్ తదితరులు మాట్లాడుతూ, ఆర్యవైష్యులు అంటే వ్యాపారాలు చేసుకుంటారు, మేతక దొరనిలో ఉంటారని అనుకుంటున్నావేమో, నువ్వు మా ఆర్య వైశ్య నాయకుడిని కించపరిస్తే పొట్లం కట్టినట్లు చిది మెస్తామని హెచ్చరించారు.తమ ఆర్య వైశ్య నాయకుడిని కుక్కను కట్టేసినట్లు కట్టేస్తా అని చెప్పడం నీ అవివేకానికి వదిలేస్తున్నామని, దమ్ముంటే రమ్మని సవాల్ విసిరారు. మా నాయకుడు వెల్లంపల్లి శ్రీనివాసులు పై దాడి చేసిన ఆర్య వైశ్యల సత్తా చూపిస్తామని అన్నారు. పార్టీమీద ప్రేమ చూపిస్తూ వ్యాపారం పరంగా అందరితో స్నేహ పూరితంగా మసలుకునే ఆర్యవైశ్య లను కించపరిస్తే అందరం ఏకం అవుతామని బోండా ఉమా నీ స్వలాభం కోసం ఆర్యవైశ్యలను రెచ్చ కొట్టవద్దని అన్నారు, ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ ఆర్య వైశ్య నాయకులు దోగి పర్తి సంతోష్,యక్కలి రాంబాబు,వాసు,మొగిలి సుబ్బారావు, గుర్రం కృష్ణ మూర్తి, గోళ్ళ కృష్ణ రావు,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఇవ్వాలి

**జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి - సీపీఐ**



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు8**

నూతన మార్కాపురం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్. నారాయణ డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత శనివారం మూడవ రోజు పట్టణంలో జరిగింది. పూల సుబ్బయ్య, పూల తాయమ్మ విగ్రహాల వద్ద నుంచి ప్రారంభమైన జాతా ప్రధాన వీధుల గుండా సాగింది.ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, దశాబ్దాలుగా మార్కాపురం జిల్లా నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి, ముంపు బాధితులకు రూ.600 కోట్ల ఆర్ఆర్ ప్యాకేజీ వెంటనే మంజూరు చేయాలని కోరారు. 2025 డిసెంబర్ నాటికి 18 ఏళ్లు నిండిన యువకులను కూడా ప్యాకేజీలో చేర్చాలని డిమాండ్ చేశారు.వర్షాభావంతో రైతులు నష్టపోతున్నారని, వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవి కృష్ణగౌడ్, నాయకులు అందె నాసరయ్య, ఎస్కే కాశిం, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# మాలకొండ ఆదాయం రూ. 11,39,191

**వలేటివారిపాలెం పెన్ పవర్ ఆగస్టు 8**

మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల్లో 11,39,191 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఐదేళ్ల రాజకీయ నిరుద్యోగులు డియస్సి ఉద్యోగాలు అమ్ముకున్నారు

## జిల్లా ఐ టీ వింగ్ అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 8**

గత ఐదేళ్లుగా రాజకీయ నిరుద్యోగం అనుభవించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక డియస్సి ఉద్యగాలను అమ్ముకోవడంసిగ్గు చేటని, దుర్మార్గమని, ఐ టీ వింగ్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి అన్నారు. దగా డియస్సిపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం మూడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎ, బి యిడి,చదివి డియస్సి రాస్తే, అర్హత సాధిస్తే, దొంగ చాటుగా, స్పోర్ట్స్ కోట అంటు ఉద్యోగాలను అమ్ముకోవడం నిరుద్యోగుల పొట్ట కొట్టడమే అని మండిపడ్డారు.టీడీపీ వాళ్ళు డియస్సి పేరిట నిరుద్యోగ యువతకు మోసం చేసి దగా డియస్సి నిర్వహించి ఉద్యోగాలను టీడీపీ అనుయాయులకు, కార్యకర్తలకు అమ్ముకున్న నారా లోకేష్ ముఖ్యమంత్రి పదవిలో కూర్చునే అర్హత లేదని,వెంటనే రాజీనామా చేయాలని కోరారు.తండ్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాబట్టే విద్యావిలువలు తెలియని నారా లోకేష్ విద్యా శాఖ మంత్రి అయ్యాడని, రాష్టంలో విద్యా శాఖను అబాసుపాలు చేసిన ఘనత నారా లోకేష్ కు దక్కిందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్,కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించుకున్న వారి ఉద్యోగాలను అక్రమంగా అమ్ముకుంటు,డియస్సి లీకేజి వ్యాపారానికి తెరాలేపాడని విమర్శించారు. కేంద్రమంత్రి రాజీనామా చేసినట్లు లోకేష్ రాజీనామా చేయాలని, చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తానని ఓట్లు వేయించుకుని గద్దెనెక్కినాక మోసం చేసాడని, నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదని ప్రశ్నించారు. జడ్పీటీసీ విజయ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సారి డియస్సిని దగా డియస్సిగామార్చింది నారా లోకేష్ వ్యాపార ధనాశ అని, నిరుద్యోగుల శాపం తగలక తప్పదని అన్నారు. నీ పార్టీ కార్యకర్తల మీదా, నాయకుల మీద ప్రేమవుంటే పార్టీ పదవులు ఇచ్చుకోవాలి గాని డియస్సి రాసిన నిరుద్యోగుల భవిష్యత్తును లక్షలకు అమ్ముకోవడం దుర్మార్గం అని అన్నారు.దోర్నాల మండల కన్వీనర్ గంట వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ డియస్సి పేపర్ లీకేజిపై సిబిసిఐ డి విచారణ చేపట్టాలని, దొంగ స్పోర్ట్స్ కోటను తొలగించి అర్హత సాధించిన డియస్సి విద్యార్థులకు ఉద్యోగఅవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అక్రమ డియస్సిని వ్యతిరేకిస్తూ జాతీయ రహదారిపై చేపట్టిన మూడవ రోజు రిలే నిరాహారదీక్షలో కూర్చున్న దోర్నాల, త్రిపురాంతకం నాయకులను అభినందనలు తెలిపి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేసారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైస్సార్సీపీ ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, జడ్పీటీసీ చేదురి విజయ భాస్కర్,జిల్లా ఐటీవింగ్ అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి,అయిదు మండలాల అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి,ఆళ్ల కృష్ణ రెడ్డి,పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాథ్,ఐ వి సుబ్బారావు, ఐ వి సత్యనారాయణ, సురేవెంకట స్వామి,కందూరి గురు ప్రసాద్,యంపీపీ ఆళ్ళ ఆంజినేయరెడ్డి, నాయకులు ఆళ్ళ కృష్ణరెడ్డి,ఓబుల్ రెడ్డి మైనార్టీ నాయకులు సయ్యద్ బుజ్జి, సయ్యద్ జబివుల్లా,షేక్ మునాఫ్, షేక్ బాబు,వైశ్య నాయకులు యక్కలి రాంబాబు,మాజీ సర్పంచ్ అరుణబాయి, పల్లే సరళ,తదితరులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 08**

పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పూరేటిపల్లి గ్రామములో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, వారి వద్ద నుండి రూ:10,160/- లు, మూడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై వి.వెంకట్రావు తెలిపారు.

# పుస్తక ప్రచురణ నిమిత్తం గురువు ఆర్థిక సహాయం

## జనసేన నాయకులు శంకర్ నాయుడు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**

రాచర్ల మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన ఎం.జగన్నాథరెడ్డి వర్డ్ బిల్డింగ్ అనే పుస్తకాన్ని రూపకల్పన చేశారు పుస్తక ప్రచురణకు రెండు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ఈ విషయాన్ని తన శిష్యులైన శంకర్ నాయుడు తెలియజేయగా తన గురువు కోసం తనవంతుగా పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఇంకా ఎవరైనా జగన్నాథ రెడ్డికి ఆర్థిక సహాయం చేయదలచిన వ్యక్తులు 9912161242 సంప్రదించి గురువు కు సహాయం చేయవలసిందిగా శంకర్ నాయుడు కోరారు.ఈ కార్యక్రమంలో రాచర్ల మండల జనసేన నాయకులు తిరుమలశెట్టి వెంకట్రావు,లంకా జనార్ధన్,వేసపోగు చిన్న,వీరయ్య, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు అడగగానే తన వంతు సహాయం అందించిన శంకర్ నాయుడుని జగన్నాథరెడ్డి అభినందించారు.

# పేకాటూరాయళ్ళు 7గురు అరెస్ట్



**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్ట్ 8**

మండలంలోని కోటపాడు గ్రామ చివరలో పేకాట ఆడుతున్న ఏడూరి వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 8650 రూపాయలు, 5 మొబైల్స్ మరియు మూడు బైకులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యకలా పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంగపేటలో కొండచిలువ కలకలం

## అటవీ అధికారులు సురక్షితంగా బంధించి అడవికి తరలింపు




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**

రాచర్ల మండలం సంగపేట గ్రామంలో ఓ ఇంటి దొడ్డి ఆవరణలోని మొక్కల మధ్య సుమారు 10 అడుగుల పొడవైన కొండచిలువ కనిపించడంతో స్థానికుల్లో కలకలం రేగింది. కొండచిలువను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం దానిని స్థానిక అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ.. విషపూరిత సర్పాలు, ఇతర పాములు కనిపించినప్పుడు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# నేడే గిద్దలూరు మున్సిపాలిటి కౌన్సిలర్లు టిడిపిలో భారీ చేరికలు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**



నేడు అట్టహాసంగా ఎమ్మెల్యే అశోక రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరనున్న నలుగురు వైసీపీ కౌన్సిలర్లు చేరనున్నారు. వీరంతా కరుడుగట్టిన వైకాపా నాయకులు కాకుండా అప్పటి ఎమ్మెల్యే అన్నా రాంబాబు కు వీరంతా ముఖ్య అనుచరులుగా ఉన్నారు. గత ఎన్నికల్లో అన్నా రాంబాబు మార్కాపురం వెళ్లటం ఆయన అక్కడే ఇన్ఛార్జిగా నియమించడం తో అప్పటి నుండి ఈ కౌనిలర్లు రాజకీయాలకు దూరంగాఉంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం , అభివృది స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గిద్దలూరు లో చేస్తున్న అభివృద్ధి కి ఆకర్షితు లై టీడీపీ లో చేరనున్నట్లు తెలుస్తుంది. మున్సిపాలిటీలో 20 కౌన్సిలర్లకు గాను గత ఎన్నికల్లో 17 మందిని వైకాపా గెలుచుకుంది. ఆదివారంచేరనున్న కౌన్సిలర్లతో కలిపి 14 మంది వైసీపీ కౌన్సిలర్లు, చైర్మన్ తో సహా టీడీపీలో చేరారు. చేరికలు కారణం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, అశోకరెడ్డి ఆదరణ నే నాని తెలుస్తుంది. ఈ చేరికలకు ఆదివారం గిద్దలూరు షాదీఖానా వేదిక కానుంది. ఈ చేరికల్లో భాగంగా పట్టణంలో భారీ ఫ్లెక్సీలు అడుగడుగునా ఏర్పాటు చేశారు. చేరికల సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించ నున్నారు.

# కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం -గొడ్డలి పార్టీతో అనర్ధమే

## ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**

గిద్దలూరు పట్టణంలోని 7 వ వార్డు కొంగళవీడు రోడ్డు లో" ఇంటింటికీ కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు " కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం నిర్వహించారు ఈ సందర్భంగా వార్డు నాయకులు , ప్రజలు ఎమ్మెల్యే కి అపూర్వ స్వాగతం పలికారు వార్డు లోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం , గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం వార్డు నాయకులు, మహిళలు ప్రజలు ఎమ్మెల్యే ను ఘనంగా శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ తెలుగుదేశం పార్టీ, కౌన్సిలర్ బిల్లా రమేష్,జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 8**



రోడ్డు ప్రమాదంలో ఒక డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన శనివారం నాడు జరిగింది. ఈ సంఘటన పొదిలి ఒంగోలు రహదారిలోని అగ్రహారం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. రోడ్డు ప్రక్కన లారీ నిలిపి రిపేర్ పనులు చేసుకుంటుండగా, మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలుకు వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ రెండు కాళ్లు మీద నుండి టైర్లు వెళ్లడంతో అతని కాళ్లు నుజ్జు నుజయ్యాయి. వెంటనే అతన్ని ఉన్నత చికిత్స కోసం ఒంగోలు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్ మరణించినట్లు సమాచారం. మరణించిన డ్రైవర్ రేనంగివరం గ్రామానికి చెందిన బి. బ్రహ్మారెడ్డిగా గుర్తించారు. ప్రమాద సంఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీధర్ తో పాటు, పొదిలి సీఐ ఎం రాజేష్, ఎస్సై సూరెడ్డి రాజేష్ లు పరిశీలించారు. ఈ సంఘటనపై పోలీసులకు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# గిద్దలూరులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ యూత్ ఫెస్టివల్ 2026 ప్రారంభోత్సవం -ముత్తుముల క్రిష్ణ కిశోర్




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**

గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బ్లూ రూర్ట్స్ న్యాచరల్ రిసోర్స్ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ యూత్ 2026 ఫెస్టివల్ లో భాగంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి సరదాగా వాలీ బాల్ టెస్ట్ మ్యాచ్ ఆడి విద్యార్థి , విద్యార్థులో ఉత్సహాని నింపారు ఈ సందర్భంగా టాస్ వేసి కోకో పోటీలు ప్రారంభించారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమన్నారు . క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ నిర్వాహకులు నీలోజి సుశాంత్ మురళి, సురేంద్ర కుమార్, షేక్ బాబావలి, మునగనూరి శివ కుమార్ లు నిర్వహించినారు. అనంతరం నిర్వాహకులు క్రిష్ణ కిశోర్ రెడ్డి ని శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పాఠశాల హెడ్మాస్టర్ , సిబ్బంది , పట్టణంలోని టీడీపీ నాయకులు, క్రీడాకారులు, యువత పాల్గొన్నారు.

# ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగాగిద్దలూరుకు చెందిన తిరుమల నాయుడు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**



ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. మొత్తం 23 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ నూతన కార్యవర్గంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా గిద్దలూరు ప్రాంతానికి చెందిన తిరుమల నాయుడును నియమించారు. ఈ సందర్భంగా తిరుమల నాయుడు మాట్లాడుతూ.. గిద్దలూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తిరుమల నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

# చిన్నఅమ్మపాలెంలో 5.5కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

## ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే ఇంటూరి -ఎస్సీ కాలనీలో రెండేళ్ల ప్రగతిపై కరపత్రాలు పంపిణీ

**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఆగస్టు 8**

రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాన్ని మండలంలోని చిన్నఅమ్మపాలెం గ్రామంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శనివారం రాత్రి నిర్వహించారు. ఎస్సీ కాలనీలో సుమారు 40 ఇళ్లకు వెళ్లిన ఆయన కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన రెండేళ్లలో జరిగిన పనుల పురోగతిని వివరించారు. కరపత్రాలు పంచారు. పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమం కోసం సుమారు 5.5 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా 1.7 కోట్లతో గాంధీనగర్ నుంచి గ్రామం మీదుగా చుండివరకు కొత్తగా తారు రోడ్డు నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 33 లక్షలతో సిసి రోడ్లు నిర్మించామన్నారు. బంగారక్కపాలెం చెరువుకును 9.8 లక్షలతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 11 మంది పేదలకు 5.78 లక్షలు వైద్య సహాయం అందించామని నాగేశ్వరరావు పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 198 మంది తల్లుల ఖాతాల్లో 59 లక్షలు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు 77 లక్షలు ఇచ్చామని నాగేశ్వరరావు తెలిపారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 197 మందికి ప్రతిఏటా 8.54 లక్షల రూపాయలు పించన్ల రూపంలో అందజేస్తున్నట్లు చెప్పారు. పొదుపు గ్రూపులకు 64 లక్షల రుణాలు అందించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అర్హులందరికీ వర్తింపు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. నెల్లూరులో కలిపిన కందుకూరు నియోజవర్గాన్ని తిరిగి ప్రకాశం





జిల్లాలో కలిపిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనిని ఎమ్మెల్యే వివరించారు. ఐదేళ్ల జగన్ పాలనలో దాడులు, బెదిరింపులు, హత్యారాజకీయాలు తప్ప అభివృద్ధి ఎక్కడైనా కనిపించిందా అని గ్రామస్తులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పీఠంలో చంద్రబాబు నాయుడు కూర్చోగానే, ఆయన దక్షతను నమ్మి కంపెనీలన్నీ ఆంధ్రప్రదేశ్ కు తరలివస్తున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. జగన్ పాలనలో కందుకూరు నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక 700 కోట్ల రూపాయల పైబడి అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే ప్రకటించారు. రాబోయే మూడేళ్లలో మరిన్ని పనులు చేపట్టి, 2029 ఎన్నికలకు మీ ముందుకు వస్తానని, మళ్లీ తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, సీనియర్ నాయకుడు పసుపులేటి సుధాకర్, పవన్, తిరుమలేష్, క్లస్టర్ ఇంచార్జ్ లు కాకుమాని హర్ష, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, మండల నాయకులు పెగడ శ్రీనివాసులు, పరిటాల భాస్కర్, కాకుమాని ఆంజనేయులు, గుత్తా మహేశ్వరరావు, తిరుపతయ్య, వలేటి మధు, కర్ణ కృష్ణారెడ్డి, రాజవరపు మాలకొండయ్య, ఉట్లపల్లి మాధవ, చెరువుపల్లి మాల్యాద్రి, మాజీ సర్పంచ్ నవులూరి రాజారమేష్, మన్నం కృష్ణ, కామినేని వీరయ్య, కామినేని అశోక్, మేకల అశోక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బైబిల్ పరీక్ష విజేతలు వీరే





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఆగస్టు 8**

మండల కేంద్రంలోనీ క్రైస్ట్ చర్చ్ నందు రూతు గ్రంథం నుంచి బైబిల్ పరీక్షను కన్వీనర్ బుట్టి పాల్ స్పర్జన్ అధ్యక్షత నిర్వహించడం జరిగింది. మార్కాపురం జిల్లా పరిసర ప్రాంతముల నుంచి రూతు గ్రంథం నుంచి బైబిల్ పరీక్ష వ్రాయుట కొరకు సుమారుగా 50 మంది యవ్వనస్తులు పాల్గొనడం జరిగింది. పరీక్ష అనంతరం యవ్వనస్తులను ఉద్దేశించి క్రైస్ట్ చర్చ్ సంఘ కాపరి పాస్టర్ బి. యన్ అగస్టిన్ మాట్లాడుతూ రూతు వలె దేవుని మీద నమ్మకం, విధేయత, ప్రేమ కలిగి జీవించటం ద్వారా మనము దీవించబడుట మాత్రమే కాక ,మనము ఇతరులకు దీవెనకరమైన పాత్రలుగా ఉండాలని, పొరుగు వారిని ప్రేమించాలని ప్రబోధించడం జరిగింది.భోజన అనంతరం బైబిల్ పరీక్ష లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించడం జరిగింది. రూతు గ్రంథం నుంచి బైబిల్ పరీక్ష లో ప్రథమ బహుమతినీ నర్రా మెర్సీ కి క్రైస్ట్ చర్చి సంఘ పెద్దలు ఆర్డ బి డిపార్ట్మెంట్ కాటి మధుజాషువ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ద్వితీయ బహుమతి జడ్డా పరిమళ కి యర్రగొండపాలెం మండలం పాలుట్ల విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ దారా చెన్నయ్య చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. తృతీయ బహుమతి చాట్ల సునీత కి క్రైస్ట్ చర్చ్ సంఘ కాపరి పాస్టర్ బి. యన్ అగస్టిన్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. రూతు గ్రంథం బైబిల్ పరీక్ష నిమిత్తం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు స్పాన్సర్ చేసిన దాతలు కాటి మధుజాషువ, లిటిల్ మాస్టర్ బుట్టి నాజీరైట్ యారో, దర్శనం ఇమ్మానుయేల్ కి బైబిల్ పరీక్ష కన్వీనర్ పాస్టర్ బుట్టి పాల్ స్పర్జన్ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్స్ మరియు ఇవాంజిలిస్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రెవరెండ్ సింగా యేసుదానం, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పాస్టర్ మేడిపల్లి అశోక్ కుమార్, గోన లివింగ్ స్టోన్, నీలం నానీ, పులుకూరి జెకర్య, గూడూరి దినకర్, పందిటి నయోమి ,కాటి రూత్ నోయా, ఉరవకొండ మాధురి మరియు యవ్వనస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# నిర్వాసితులకు అన్ని వసతులు కల్పించాలి

## ముంపు ప్రజలకు అండగా ఉంటాం – ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 8**

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్, అధికారులను కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద సాంకేసుల గ్రామ నిర్వాసితులతో కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్లాట్ల కేటాయింపు, పునరావాస ప్రాంతంలోని సదుపాయాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాసిత కుటుంబాలు ఇబ్బందులు పడకుండా పునరావాస ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి వసతులు పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. ప్రజలతో కలిసి,ప్రజల కోసం అనే నినాదంతో పని చేస్తున్నామని తెలిపారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం అయ్యే వరకు వారితో కలిసి ఉంటామని స్పష్టం చేశారు.సాంకేసుల ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని ,కేటాయించిన ప్లాట్లలో అవసరమైన వసతులు కల్పించేలా అధికారులతో సమన్వయం చేస్తామన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడతాం అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.నిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే కత్తితో దాడి.. మహిళకు తీవ్ర గాయాలు

## విజయ టాకీస్ సమీపంలో కలకలం..

## యువకుడి కోసం పోలీసుల గాలింపు

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 8**


పట్టణంలోని విజయ టాకీస్ సమీపంలోని బాసాని బజార్ లో పట్టపగలే ఓ యువకుడు కూరగాయలు తరిగే కత్తితో మహిళపై దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. విజయ టాకీస్ సమీపంలో నివాసం ఉంటున్న జ్ఞాన దృష్టి నాగలక్ష్మి (40) శనివారం ఇంట్లో వంట చేసుకుంటుండగా, బాసాని మురళి (22) అనే యువకుడు పసుపు కావాలి అంటూ ఇంట్లోకి వచ్చాడు. మాటల మధ్యలో ఉన్నట్టుండి నాగలక్ష్మిపై కత్తితో సుమారు 8 సార్లు దాడి చేశాడు. నాగలక్ష్మి చేసిన కేకలకు స్థానికులు పరుగున రావడంతో మురళి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన నాగలక్ష్మిని స్థానికులు వెంటనే సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నాగలక్ష్మి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న మురళి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. పట్టణంలో పట్టపగలే ఇలాంటి ఘటన జరగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# అంగరంగవైభవంగా నెమలిగుండ్ల రంగ నాయకస్వామి కళ్యాణం

## నెమలిగుండానికి పోటెత్తిన భక్తులు





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**

రాచర్ల మండలంలోని జేపీ చెరువు సమీపంలోని న నలమల్ల కీకారణ్యంలో గుండ్ల కమ్మనది చెంత ఎత్తయిన కొండపై వెలసి ఈప్రాంత వాసుల ఇలావేల్పుగా భక్తుల కొంగుబంగారం , పిలిచినంతనే పలికే శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి కళ్యాణం రెండవశనివారం కమణీయంగా అర్చక స్వాములు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని రంగని కల్యాణాన్ని తిలకించి పునీతులయారు. నెమలిగుండ్ల రంగడికి ప్రతి నెలరెండవ శనివారం కన్నులపండువుగా కల్యాణం నిర్వహించటం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. కాకుండా ఈ ఆలయాన్ని శనివారం మాత్రమే తెరచి అభిషేకాది, పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇయువురు దేవేరుల తో స్వామివారి ఉత్సవమూర్తులను ఉదయాన్నే కళ్యాణ మండపానికి భాజాభజంత్రీల, మేళతాలతో , అర్చకుల వేదమంత్రోత్సరణల మద్య చేరుస్తారు . అనంతరం కళ్యాణ తంతు అర్చక స్వాములు ప్రారంభిస్తారు. ముందుగా స్వామి, ఇరువురు దేవేరుల ప్రవర ను అర్చకులు తమ సుమధుర కంఠంతో పఠించి, నిర్దేశించిన సమయానికి శాస్త్రోక్తంగా జీలకర్ర బెల్లం ను కళ్యాణ మూర్తుల శిరస్సు పై పెట్టించి , వేద ఘోషల మధ్య మాంగళ్య ధారణ , తలంబ్రాలు తదితర తంతులను కమణీయంగా , అంగరంగ వైభవంగా గోవింద నామెస్మరణలు మార్మోగుతుండగా నిర్వహిస్తారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని వేలాదిమంది భక్తులు తిలకించి పునీతులయ్యారు. శనివారం కావటం తో రంగడి కొండకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారి అగ్ని సేవలు భక్తిశ్రద్ధాలతో నిర్వహించారు. భక్తులకు వలసిన సౌకర్యాలను ఆలయకమిటీ ఏర్పాటు చేశారు. శయనభంగిమలో ఉన్న నెమలిగుండ్ల రంగనాయక స్వామివారి మూలవిరాట్ ను భక్తులు దర్శించుకున్నారు. ఆలయకమిటీ తీర్థప్రసాదాల నోసంగారు . ఈస్వామి వారి కొండల్లో ప్రతి శనివారం అన్నికులాలకు చెందిన సత్రాలు ఉన్నాయి ,ఇక్కడ భోజన సంతర్పన చేస్తారు ఈ ఆలయప్రాంగణం ప్రకృతి సౌందర్యానికి నెలవు.

# పాఠశాల అభివృద్దే మా అజెండా

## సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఏక నిర్ణయం





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 8**

సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాఠశాల పూర్వ విద్యార్థులు అందరూ కలిసి అంకితభావంతో దీర్ఘకాలిక ప్రణాళికతో పనిచేయాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మక్కెన బ్రహ్మయ్య అధ్యక్షతన శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గత రెండు నెలలుగా పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల క్రీడా మైదానం, తరగతి గదుల్లో మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. క్రీడా మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్ది గ్రామస్థుల కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక ఆంగ్ల ఉపాధ్యాయుడిని నియమించడం, శాశ్వత లైబ్రరీ ఏర్పాటు చేయడం, ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం, పాఠశాల అభివృద్ధి నిధిని సమీకరించడం వంటి అంశాలపై ఏకగ్రీవంగా తీర్మానించారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతో విద్యతోపాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, పర్యావరణ పరిరక్షణతో ప్రశాంతమైన ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు పూర్వ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామం నుంచి క్రీడా మైదానానికి వాకింగ్‌కు వచ్చే పెద్దలకు కూడా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో క్రీడా మైదానం ఆవరణలో అడుగడుగునా మొక్కలు నాటి, వాటిని దత్తత తీసుకొని సంరక్షిస్తూ పెంచేందుకు నడుం బిగించినట్లు పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణను కూడా తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో ఈదర రాజశేఖర్‌బాబు, మలిగిరెడ్డి హరికృష్ణరెడ్డి, బండారు లక్ష్మీనారాయణ, కోవెలకుంట్ల శ్రీనివాసరెడ్డి, కంచర్ల ప్రసాద్, తొట్టెంపూడి పుల్లారావు, తేలుకుట్ల శ్రీనివాసరావు, అట్లా శ్రీనివాసరెడ్డి, అర్వపల్లి రత్తయ్య, కమ్మ శ్రీనివాసరావు, జెట్టి శ్రీనివాసరావు, బాదినేని యోగేశ్వరరావు, ఇల్లూరు కోటిరెడ్డి, ఇల్లూరి శ్రీనివాసరెడ్డి, షేక్ కరిముల్లా, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మక్కెన బ్రహ్మయ్య, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి అట్లా శ్రీనివాసరెడ్డి, అట్లా మోహన్‌రెడ్డి, కుర్ర అంజయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## కొండిశెట్టి వెంకటరమణయ్య



**సి ఎస్ పురం , పెన్ పవర్ ఆగస్టు 8**

బిజెపి మండల కార్యవర్గ సమావేశం బిజెపి మండల అధ్యక్షులు పాశం రామకృష్ణ మండల ప్రధాన కార్యదర్శి. ఇండ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి మండల ఇన్చార్జి కొండిశెట్టి వెంకట రమణయ్య పాల్గొనడం జరిగింది ఈ సమావేశంలో నూతన భారతీయ జనతా యువమోర్చా నూతన అధ్యక్షులుగా సంగిశెట్టి అనిల్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొని రమణయ్య మాట్లాడుతూ యువమోర్చ ద్వారా నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలు ముందుకు తీసుకెళ్లి భవిష్యత్తులో రాబోవు స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరడం జరిగింది బిజెపి సి ఎస్ పురం మండల యువమోర్చా ఈ క్రింది కార్యవర్గాన్ని నియమించడం జరిగింది అధ్యక్షులుగా సంగిశెట్టి అనిల్, ఉపాధ్యక్షులుగా, పి శివ, కే నవీన్, ఎస్ ప్రసాద్, జే విష్ణు, పి నారాయణ, బి మనితేజ, ప్రధాన కార్యదర్శులుగా, కే నరేంద్ర, ఎస్ వంశీ, కార్యదర్శి లు గా పి సాయి, జి నారాయణ, జి వెంకటనారాయణ, ఎస్ అంకయ్య, ఎల్ పెద్దన్న, కోశాధికారిగా పి సురేష్, కార్యవర్గ సభ్యులుగా ఎస్ నరసింహ, బాలచంద్ర,, పి చిన్న చెంచయ్య గాని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, మన్నేపల్లి మాల్యాద్రి, జాజం చిన్న సుబ్బయ్య, పి శ్రీను, ఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు10న జరిగే “జైల్ భరో”ని జయప్రదం చేయండి

## కార్మిక,రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పిలుపు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 9**

కేంద్ర కార్మిక,రైతు, వ్యవసాయకార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10వ తేదీన కనిగిరిలో జరిగే “జైల్ భరో” నిరసన కార్యక్రమం ను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అమెరికాతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి, స్వామినాదన్ కమీషన్ సిఫారసులను అమలు,లేబర్ కోడ్స్ రద్దు చేయాలి,జాతీయ ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ,కనీస వేతనం 26వేలు ఇవ్వాలి, స్కీం వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి, టైం స్కేల్, డైలీవేజ్ అవుట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి, తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సమగ్ర చట్టం చేయాలి సంక్షేమ పథకాలు అమలు చేయాలి, అన్ని పంటలకు ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50% కలిపి మద్దతు ధర నిర్ణయించాలి, కరువు సహాయక చర్యలు చేపట్టాలి ఉచిత పంటల భీమా అమలు చేయాలి, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంట రుణాలు ఇవ్వాలి, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలి రోజుకు 700 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలి, పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలి, స్టీల్ ప్లాంట్ విద్యుత్ ఆర్టీసీ మున్సిపాలిటీలతో సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ విధానాలు ఆపాలి, ప్రధానమైన డిమాండ్లతో కార్మికులు,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జైల్ భరో కార్యక్రమము నిర్వహిస్తామని తెలియజేశారు.రైతు సంఘం మండల అధ్యక్షులు యం. రత్నారెడ్డిపాల్గొన్నారు.



# డీఎస్సీలో దగా.. జవాబు చెప్పు లోకేశ్

## రిలే దీక్షతో హోరెత్తించిన వైసీపీ -సీబీఐ విచారణ, మంత్రి రాజీనామాకు డిమాండ్





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 8**

డీఎస్సీ-2025 నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయని, అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం మూడో రోజుకు చేరుకుంది.వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఈ దీక్ష కొనసాగుతోంది. దీక్షలో తర్లుపాడు మండలం, మార్కాపురం మున్సిపాలిటీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మూడో రోజు దీక్షలో అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొని ఉదయం నుంచి నిరాహారం చేస్తున్న దీక్షాదారులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.ఈ సందర్భంగా బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీ అనేది నిరుద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశం. కానీ ఈ ప్రభుత్వం అందులో కూడా రాజకీయ జోక్యం చేసి అక్రమాలకు పాల్పడింది. నిజాయితీగా చదివిన పిల్లలకు ఉద్యోగాలు రాకుండా చేశారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలి. రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. అన్నా రాంబాబు మాట్లాడుతూ..గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి వేలాది మందికి ఉద్యోగాలు ఇచ్చామని, కానీ ఇప్పుడు అధికార పార్టీ నేతల అల్లుళ్లు, బంధువులకు ఉద్యోగాలు కట్టబెట్టేందుకే ఈ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. డీఎస్సీలో అవకతవకలపై న్యాయ విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనర్హులను తొలగించి అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు, మండల ఇంచార్జులు, యువజన, విద్యార్థి విభాగ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ మున్సిపల్ మాజీ చైర్మన్ చలంచర్ల బాలమురళీకృష్ణ, వైసిపి స్టేట్ బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పి ఎల్ పి యాదవ్, జడ్పిటిసి నారు బాపన్ రెడ్డి, కోటిరెడ్డి, చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, 18 బ్లాక్ ఇన్చార్జి సయ్యద్ గఫూర్, కేతగుడిపి మాజీ సర్పంచ్ పెద్ద మస్తాన్, సీఎం, విద్యార్థి విభాగం నాయకులు అంజిరెడ్డి, గౌస్ మొహిద్దిన్, టౌన్ సోషల్ మీడియా అధ్యక్షులు రఫీ, ఆయుబ్, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నాయకులు, యువత పాలుగున్నారు.

# కొమరోలు లో ని శివాజీ నగర్‌లో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కరపత్రాలు పంపిణీ

## కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 8**

మండల కేంద్రమైన కొమరోలులోని శివాజీ నగర్ లో ఆరెమరాఠి కాలనీలో శనివారం కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కరపత్రాలు పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు కొమరోలు సహకార సంఘం చైర్మన్ ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు శనివారం శివాజీ నగర్ లో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టి వాటి గురించి ప్రజలకు వివరించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి, ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. ఆ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, పెనుగొండ వెంకటరమణ, మల్లికార్జున,కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని, యువ నాయకులు కరీముల్లా,కాశి, బుజ్జి, నెల్లూరు సుభాని, అబ్దుల్ ఖాదర్, ఖాదర్ భాషా తదితర నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ శివాజీ నగర్ లో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త నేతలు.

# 20శాతం ఇథనాల్‌తో కాలుష్యానికి అడ్డు.. రైతులకు లాభం

## కర్బన ఉద్గారాల తగ్గింపు - బీజేపీ నేత ఏలూరి



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 8**

పెట్రోల్ లో ఇరవై శాతం ఇథనాల్ కలపడం ద్వారా దేశ ఇంధన భద్రత బలపడడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు, రైతుల ఆదాయానికి మేలు జరుగుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు.శనివారం స్థానిక జిల్లా భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013-14లో ఒకటిన్నర శాతం కంటే తక్కువగా ఉన్న ఇథనాల్ కలయిక ప్రస్తుతం ఇరవై శాతానికి చేరిందన్నారు. ఇరవై శాతం ఇథనాల్ ఇంధనం ద్వారా ఇప్పటివరకు 544 లక్షల మెట్రిక్ టన్నుల కర్బన వాయు ఉద్గారాలు తగ్గాయని, 181 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు వినియోగం తగ్గిందని చెప్పారు. దీంతో దాదాపు ఒక లక్ష ఆరు వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా అయిందన్నారు.ఇథనాల్ తయారీకి వ్యవసాయ ఆధారిత ముడి పదార్థాలు వాడటం వల్ల రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇరవై శాతం ఇథనాల్ ఇంధనం నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇరవై శాతం ఇథనాల్ పై ప్రతిపక్షాలు అనవసరంగా విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. ముడి చమురు దిగుమతులు తగ్గిస్తూ, రైతుల ప్రయోజనాలు కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ చర్యలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు, కార్యదర్శి మద్దెల లక్ష్మీదేవి, నాయకులు దేవిశెట్టి చంద్రశేఖర్, మండ్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

**భీమిలి, పెన్ పవర్ ఆగస్టు 8**

భీమిలి స్థానిక ఎస్వీఎల్ఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రవేశాలలో బి ఎ హిస్టరీ, పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బిఎస్సి కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్, బయాలజీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ ప్రకటంలో తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి సురేఖ తెలియజేశారు.



# నేతన్న సేవలో పథకం లబ్ధిదారుల ఎంపికపై అవినీతి ఆరోపణలు

## మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకువెళ్లాలి - కందిమల్ల ఆదినారాయణ



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 08**

సంతమాగులూరు మండలం చవిటిపాలెం గ్రామంలో చేనేత కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న సేవలో పథకం చేనేత కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోంది. చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న అర్హులైన కార్మికులను గుర్తించి వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేతన్న సేవలో పథకం చేనేత వృత్తిలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 25,000 ఆర్థిక సాయం అందిస్తుంది. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడంతో పాటు సాంప్రదాయ చేనేత వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమని నేతన్నలు పేర్కొంటున్నారు. పార్టీలకు అతీతంగా నేతన్న సేవలో పథకాన్ని చవిటిపాలెం గ్రామ లబ్ధిదారులకు ఒక్కో కుటుంబానికి రూ. 25,000 చప్పున అందించినదుకు రాష్ట్ర ప్రభుత్వనికి, ప్రత్యేకంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ కు చవిటిపాలెం దండయాత్ర టీమ్ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా కొంత మంది మంత్రి పేరు అడ్డుపెట్టుకొని నేతన్న సేవలో పథకంలో భాగంగా చవిటిపాలెం గ్రామంలో 157 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. అసలు విషయానికి వస్తే ఒక చవిటి పాలెం గ్రామంలోనే 25 లక్షలు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు అదే గ్రామానికి చెందిన కందిమల్ల ఆదినారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదులో చేనేత కుటుంబాలు అర్హులైన వారు 65 నుండి 70 మంది మాత్రమే ఉన్నారని, చవిటి పాలెం గ్రామానికి చెందిన మంచా రాంబాబు అనే వ్యక్తి మరియు మండల అధికారులు కలిసి 157 మంది ఉన్నట్లు తప్పుడు నివేదికలు ప్రభుత్వానికి పంపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంచ రాంబాబు అనే వ్యక్తి ఒక్కో లబ్ధిదారుడు రూ.5000 డిమాండ్ చేస్తున్నట్లు ఆదినారాయణ ఆరోపించారు.తక్షణమే విచారణ జరిపి అక్రమంగా లబ్ది పొందిన వారి బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి సోషల్ ఆడిట్ జరపాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలిపారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

## వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్

**సి ఎస్ పురం పెన్ పవర్ ఆగస్టు 8**

డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని,ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి రూ. 3000 వెంటనే ఇవ్వాలని కోరుతూ కనిగిరి టౌన్ లోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా శనివారం ఉదయం 3 వ రోజు రిలే నిరాహార దీక్ష లో పాల్గొన్న కనిగిరి వైఎస్సార్సీపీ ఇంచార్జ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు3 వ రోజు రిలే నిరాహార దీక్షలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరి రెడ్డి,గంగసాని హుస్సేన్ రెడ్డి,వై.యం ప్రసాద్ రెడ్డి,చింతకుంట్ల సాల్మన్ రాజు,ఓకే రెడ్డి,యక్కంటి శ్రీనివాసుల రెడ్డి,కటికల వెంకటరత్నం,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, రాచపూడి మాణిక్యరావు,గూడూరి అబ్రహం లింకన్,ఆవుల భాస్కర్ రెడ్డి,మూలే గోపాల్ రెడ్డి,వాకమల్ల రాజశేఖర్ రెడ్డి,షేక్ రహీం భాషా, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పోలక సిద్ధారెడ్డి, బత్తుల మాలి,మితికాల గురవయ్య, ముడుమాల నారాయణరెడ్డి, భువనగిరి వెంకటయ్య, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి,యర్రబెల్లి దేవరాజు, పోతు రమణారెడ్డి, పచ్చ వెంకటసుబ్బయ్య చౌదరి, గుంటూరీ వెంకటేశ్వర్లు చౌదరి, అయిమళ్ళ నాగమణి, నెలకుర్తి మహేశ్వరి,మార్తల వెంకటేశ్వర్ రెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి,పందిటి వెంగళరావు, మోరం మొరార్జీ,కాకర్ల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీనివాసులు, చింతకుంట్ల కిషోర్ బాబు, సిగా కృష్ణారావు, దాదిరెడ్డి మాలకొండ రెడ్డి, బచ్చు వెంగళరావు గుప్తా, దరిశి సుబ్రహ్మణ్యం, పలుకూరీ భాస్కర్, దర్శి ఫణి కుమార్, సంగటి మహేందర్ రెడ్డి, షేక్ సన్నీ, షేక్ పోలిచర్ల భాష, మన్నేపల్లి పెద్దన్న,సంగు కృష్ణారెడ్డి, పోలంరెడ్డి బాల మాలకొండ రెడ్డి, మండాది కృష్ణారెడ్డి, డబ్బుకొట్టు రవికుమార్, గుదే రమణయ్య చౌదరి, పరిసపోగు ఆదాము, పందిటివెంగళరావు, మేడిబోయిన అటేలయ్య,పిన్నిక మాధవ్, బత్తుల శ్రీను, డాక్టర్ షేక్ గౌస్, కుర్ర చిరంజీవి, అంబాల శేఖర్ రెడ్డి, ధనింగుల వెంకటరాజు, లక్కిరెడ్డి



హనుమారెడ్డి, వంకదారి రాజా ,మల్లెల యాకోబు, శెట్టిపల్లి కొండయ్య, ముద్దా బాబు,శ్యామల సామిరెడ్డి, కనుమర్ల వెంకటేశ్వర్ రెడ్డి, తెల్లగడ్డ వెంకటరావు, మల్లెల వేలుకొండయ్య,బలసాని యెహోషువ, వీరంరెడ్డి రవీంద్రారెడ్డి, పగడాల శివకృష్ణ, కటకం లక్ష్మీనరసయ్య, శీలం శివారెడ్డి,ప్రత్తి సురేష్ రెడ్డి,దమ్ము వెంకటయ్య, తాతపూడి సురేష్, తాతపూడి నాని, గంజి రవీంద్రారెడ్డి, ఇండ్ల భాను, మద్దిశెట్టి భారతి, సుస్మిత, ఎనిమిరెడ్డి సుమలత, ఎలికా అచ్చయ్య, మన్నెం మాధవ,బక్కా భాగ్యరాజ్, ఎర్రబల్లి సౌరీలు, రాజారావు, అత్యల ఇసాక్, బోయ నాగేశ్వరరావు, బలసాని మోహన్, చియాద్రి బాల గురవయ్య, చీమలదిన్నె రమేష్, రాయ గుంటయ్య, కాకు నాగరాజు, సంగటి బాబు, మిట్ట రమేష్ రెడ్డి, బసిరెడ్డి కోటిరెడ్డి, బిరం మల్లికార్జున రెడ్డి, దాసరి మాల్యాద్రి, బీరం కృష్ణ, ముత్తుముల వెంకటనారాయణ, పొంకం పెద్దయోగి, కామనబోయిన కృష్ణయ్య, బొట్టు శ్రీను, వీరం రెడ్డి లక్ష్మిరెడ్డి, నంబుల అడివయ్య, కటుకూరీ చిన్న పేరయ్య, షేక్ ఖాదర్ జిలాని, మల్లెల ప్రవీణ్, అంబటి విజయ్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# ఉచిత వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోండి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 08**

ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం, విశ్వకర్మ ఫౌండేషన్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల ఆగస్టు 15న ప్రకాశం జిల్లా అద్దంకి మండలం సింగరకొండలోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు గిద్దలూరు సంఘం నాయకులు వెల్లడించారు. వివాహ బంధం కోసం ఎదురుచూస్తున్న విశ్వబ్రాహ్మణ యువతీ యువకులకు ఒకే వేదికపై పరిచయ అవకాశాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యే దాదాపు 5,000 మంది పెళ్లి కావాల్సిన యువతీ యువకుల వివరాలను పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు మాట్లాడుతూ, సమాజానికి చెందిన యువతీ యువకులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని, పరిచయ వేదికను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు షరాబు దత్తాత్రేయాచారి, నాయకులు రావినూతల రంగాచారి, ఎస్. చంద్రశేఖరాచార్య పిలుపునిచ్చారు. సమాజంలోని యువతీ యువకులకు సరైన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, ఎలాంటి రుసుము లేకుండా నిర్వహిస్తున్న ఈ మహత్తర సేవా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సమాజ ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు యువత భవిష్యత్తుకు దోహదపడే ఈ ఉచిత వివాహ పరిచయ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## శ్రీలంక సిరీస్‌కు ముందు టీమిండియాకు మరో షాక్.. సాయి సుదర్శన్ దూరం!

- నంబర్-3 స్థానంపై టీమిండియాలో చర్చ
- వార్మప్‌లో సెంచరీతో రేసులోకి పడిక్కల్
- బుమ్రా, హర్షిత్ రాణా, నితీశ్, సుందర్ కూడా దూరం
- డబ్ల్యూటీసీ పాయింట్ల కోసం భారత్, శ్రీలంక పోరు
- 2027 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో భారత్‌కు సిరీస్ కీలకం
- కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి భారత్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో కీలకమైన నంబర్-3 స్థానంపై జట్టు మేనేజ్‌మెంట్ మరోసారి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టెస్టుల్లో సుదర్శన్ అరంగేట్రం చేసిన తర్వాత మూడో స్థానంలో భారత్ ప్రధాన ఎంపికగా మారాడు. అయితే ఆ స్థానాన్ని పూర్తిగా సుస్థిరం చేసుకోకముందే గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీ చేయడంతో అతడికి మూడో స్థానంలో అవకాశం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.సుదర్శన్‌కు ముందు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ కూడా గాయాలతో అందుబాటులో లేరు. దీంతో శ్రీలంక పర్యటనకు భారత్ కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనుంది.సుదర్శన్ ఎంపిక సమయంలోనే అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. కాలి గాయం నుంచి కోలుకుంటున్న అతడికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. తాజాగా అతడు సిరీస్‌కు పూర్తిగా దూరమైనట్లు తేలింది.రెండు టెస్టుల సిరీస్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పరంగా భారత్‌కు కీలకం. ప్రస్తుతం భారత్ ఐదో స్థానంలో ఉంది. శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. 2027 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ముందుకు వెళ్లాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్‌లో పాయింట్లు కీలకం. సుదర్శన్ గైర్హాజరీతో భారత్ బ్యాటింగ్ కూర్పులో మార్పులు తప్పనిసరయ్యాయి. పడిక్కల్ సెంచరీ చేయడంతో నంబర్-3 స్థానానికి పోటీ ఆసక్తికరంగా మారింది. మరోవైపు కీలక బౌలర్లు దూరం కావడంతో శ్రీలంక సిరీస్ టీమిండియా బెంచ్ బలానికి పరీక్షగా మారనుంది.

# అయ్యో పాపం.. వెస్టిండీస్ వరల్డ్‌కప్ ఆశలపై నీళ్లు చల్లిన ఆఫ్ఘన్.. క్వాలిఫికేషన్ రేసులో మళ్లీ గందరగోళం!






**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ ట్రోఫీలు గెలిచిన దిగ్గజ చరిత్ర మాది అని చెప్పుకోవడం తప్ప, కనీసం టోర్నీకి నేరుగా అర్హత సాధిద్దాం అనే ఆలోచన వెస్టిండీస్ క్రికెట్ బోర్డుకి అస్సలు ఉన్నట్లు కనిపించడం లేదు.. 2027 వన్డే వరల్డ్ కప్‌కు కనీసం ఈసారైనా క్వాలిఫైయర్స్ ఆడకుండా డైరెక్ట్‌గా వెళ్తారేమో అని ఫ్యాన్స్ ఆశపడితే.. మాకింత సీన్ లేదు బాస్ అని మళ్లీ పాత దారినే సెలక్ట్ చేసుకుంటున్నారు. ఐర్లాండ్‌పై ఆఫ్ఘనిస్తాన్ 92 రన్స్ తేడాతో గెలవడంతో, విండీస్ డైరెక్ట్ క్వాలిఫికేషన్ ఆశలు గాల్లో కలిసిపోయాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు అప్పుడే నేరుగా బెర్తులు ఖరారయ్యాయి. సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉంటేనే డైరెక్ట్ ఎంట్రీ దక్కుతుంది. కానీ విండీస్ వీరులు మాత్రం ర్యాంకింగ్స్ అడుగున స్థిరపడటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.

**వరల్డ్ కప్ క్వాలిఫికేషన్‌లో విండీస్‌ది వింతైన రికార్డు:**

2019 వరల్డ్ కప్: డైరెక్ట్ ఎంట్రీ దక్కక క్వాలిఫైయర్స్ ఆడి అతికష్టం మీద టోర్నమెంట్లోకి వచ్చారు.

2023 వరల్డ్ కప్: క్వాలిఫైయర్స్ లో జింబాబ్వే, నెదర్లాండ్స్, స్కాట్లాండ్ చేతిలో దెబ్బతిని.. అసలు వరల్డ్ కప్‌కే రాకుండా టీవీల్లో మ్యాచ్‌లు చూడాల్సి వచ్చింది.

2027 వరల్డ్ కప్: సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ఏమైనా అద్భుతం జరిగి ర్యాంకింగ్స్ పెరిగితే సరేసరి, లేదంటే హ్యాట్రిక్ బులెట్ లాగా మళ్లీ క్వాలిఫైయర్స్ ఆడటానికి విండీస్ సిద్ధం కావలసిందే.

**విండీస్ ఆశలపై నీళ్లు చల్లిన ఆఫ్ఘన్:**

న్యూజిలాండ్ చేతిలో సిరీస్ ఓటమితో విండీస్ స్థానం మరింత పాతాళానికి పడిపోగా, ఆఫ్ఘనిస్తాన్ మాత్రం వరుస విజయాలతో ముందుకు దూసుకుపోతుంది.

# క్రికెట్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్.. ది హండ్రెడ్ లీగ్ నుంచి జెమీమా ఔట్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ది హండ్రెడ్ ఉమెన్స్ టోర్నమెంట్‌లో అద్భుతమైన ఫామ్‌తో చెలరేగుతున్న భారత స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ సదర్న్ బ్రేవ్ జట్టుకు దూరమైంది. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆమె టోర్నీలోని మిగిలిన మ్యాచ్‌ల నుంచి వైదొలిగినట్లు ఫ్రాంచైజీ ధృవీకరించింది. సదర్న్ బ్రేవ్ తరఫున అత్యంత కీలక బ్యాటర్‌గా రాణిస్తున్న జెమిమా స్థానంలో ఆస్ట్రేలియాకు చెందిన చార్లీ నాట్ ను రీప్లేస్‌మెంట్‌గా తీసుకున్నారు. కాగా జెమిమా ఈ టోర్నీలో 6 మ్యాచ్‌ల్లో 35.75 సగటు, 131.19 స్ట్రైక్ రేట్‌తో 143 పరుగులు చేసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది.

**వరుసగా రెండుసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు:**

సదర్న్ బ్రేవ్ సాధించిన వరుస విజయాల్లో జెమిమా రోడ్రిక్స్ ఇన్నింగ్స్‌లు మ్యాచ్ విన్నర్లుగా నిలిచాయి. 36/3తో జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో జెమిమా 34 బంతుల్లో 42 పరుగులతో నాటౌట్‌గా నిలిచి సదర్న్ బ్రేవ్‌కు 5 వికెట్ల విజయాన్ని అందించింది. ఈ మ్యాచ్‌లో ఆమె ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికైంది. అలాగే ఆ తర్వాత మ్యాచ్‌లో 22 బంతుల్లోనే 32 రన్స్ (స్ట్రైక్ రేట్ 145.45) చేసి జట్టు 126 పరుగులు సాధించడంలో సహాయపడింది. ఆపై బ్రేవ్ ఒక్క పరుగు తేడాతో గెలవగా, జెమిమా వరుసగా రెండోసారి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకుంది.

**సదర్న్ బ్రేవ్ ప్రస్తుత పరిస్థితి:**

మొదటి 5 మ్యాచ్‌లలో వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన సదర్న్ బ్రేవ్‌కు జెమిమా లేకపోవడం పెద్ద లోటే అని చెప్పాలి.. ఆగస్టు 3వ తేదీన వెల్ష్ ఫైర్ తో జరిగిన మ్యాచ్‌లో 121/5 పరుగులు చేయగా, ప్రత్యర్థి జట్టు ఆఖరి బంతికి లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో ఓడించింది.

**ప్రధాన బ్యాటర్లు: లారా వోల్వార్ట్, మైయా బౌచియర్, లిజెల్ లీ.**

ప్రధాన బౌలర్లు: లారెన్ బెల్, ఇస్సీ వాంగ్, సారా గ్లెన్, సోఫీ మోలినెక్స్.

ఆగస్టు 8వ తేదీన, శనివారం సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ వేదికగా మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌తో పెనాల్టిమేట్ లీగ్ మ్యాచ్‌లో బ్రేవ్ తలపడనుంది. జెమిమా లేని లోటును చార్లీ నాట్ ఏ మేరకు భర్తీ చేస్తుందో చూడాలి మరి.

**'ఇస్మార్ట్' బ్యూటీ నాభా నటేష్: కెరీర్ విశేషాలు డ రాబోయే చిత్రాలు**



# చిక్ కేఫే స్టైల్‌లో పూజా హెగ్డే గ్లామర్ షో.. యెల్లో డ్రెస్ హైలైట్!



బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. విదేశీ వీధుల్లో, ఒక వినూత్నమైన కేఫే బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఆమె లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు బాడీకాన్ డ్రెస్‌లో తన స్టైలిష్ లుక్స్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ షేర్ చేసిన ఈ గ్లామరస్ పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.

**బుడాపెస్ట్ కేఫేలో చిక్ అండ్ గ్లామరస్ లుక్:**

ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉన్న పూజా హెగ్డే, బుడాపెస్ట్‌లోని ఒక వినూత్నమైన కేఫేలో ఈ సరదా ఫొటోషూట్ చేశారు. గోడల నిండా చేతిరాత నోట్లు, నేలపై ఎండుగడ్డి చల్లి ఉన్న క్రియేటివ్ కేఫేలో ఒక కలప స్టూల్‌పై కూర్చుని ఆమె క్యూట్‌గా ఫోజులిచ్చారు. "పుట్ ద పెస్ట్ ఇన్ బుడాపెస్ట్" అని తన ఫొటోలకు ఇచ్చిన సరదా క్యాప్షన్ నెటిజన్లను భలే ఆకట్టుకుంటోంది.

**యెల్లో అవుట్‌ఫిట్ అట్రాక్షన్:**

ఈ ఫొటోషూట్‌లో పూజా హెగ్డే ధరించిన యెల్లో కలర్ ఫిట్టెడ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది. డీప్ వి-నెక్‌లైన్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు తోడు ఓవర్ సైజ్డ్ క్రీమ్ షేడ్ సన్ గ్లాసెస్, కలర్‌ఫుల్ ప్యాటర్న్ వేస్ట్ బ్యాగ్ మరియు హైహీల్డ్ మెటాలిక్ ప్లాట్‌ఫార్మ్ శాండల్స్‌ను మ్యాచ్ చేశారు. ఇక తన పక్కనే కలర్‌ఫుల్ బ్యాగ్ ఉంచి, ఒక చేతితో జుట్టును సరిచేసుకుంటూ ఆమె ఇచ్చిన క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తోంది.

**తొలి అడుగు నుంచి సౌత్, నార్త్ పాన్ ఇండియా రేంజ్:**

'ముగమూడి' అనే తమిళ సూపర్ హీరో చిత్రంతో వెండితెరకు పరిచయమైన పూజా, తెలుగులో 'ఒక లైలా కోసం', 'ముకుంద' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'మొహెంజోదారో'తో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. 'దువ్వాడ జగన్నాథమ్', 'మహర్షి', 'అల వైకుంఠపురములో', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి వరుస హిట్‌లతో టాలీవుడ్‌లో అగ్ర నటిగా నిలిచారు. ఇక విజయ్ సరసన 'బీస్ట్', ప్రభాస్ సరసన 'రాధే శ్యామ్' వంటి భారీ చిత్రాల్లోనూ మెరిసారు.

**చేతినిండా క్రేజీ ప్రాజెక్ట్‌లు:**

ఇటీవలే హిందీ థ్రిల్లర్ 'దేవా', సూర్యతో కలిసి 'రెట్రో', అలాగే 'కూలీ' సినిమాలో ప్రత్యేక పాత్రలో మెరిసిన పూజా హెగ్డే, నటించి అలరించారు. ఇక ఇటీవల వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై', విజయ్ కాంబినేషన్‌లో 'జన నాయగన్', మూవీస్ తో ప్రేక్షకుల ను పలకరించారు. ఇక దుల్కర్ సల్మాన్‌తో 'శ్రీ శ్రీ' అనే తెలుగు రోమాంటిక్ డ్రామా మరియు 'కాంచన 4' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు.కేవలం సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫొటోషూట్‌లతో నిత్యం ట్రెండింగ్‌లో ఉండటం పూజా హెగ్డే ప్రత్యేకత. పాన్ ఇండియా స్థాయిలో వరుస సినిమాలతో అలరిస్తూనే, ఇలాంటి గ్లామరస్ లుక్స్‌తో ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇస్తున్న ఈ బుట్టబొమ్మ రాబోయే చిత్రాలతో మరింత ఘనవిజయాలు సాధించాలని కోరుకుందాం.



**పీచ్ రంగు ఆర్గాంజా చీరలో అద్భుతమైన అందంతో ఆమ్నా షరీఫ్; కాలాతీతమైన సాంప్రదా య హుందాతనాన్ని చాటుతున్న ఈ సుందరమైన చిత్రం.**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com